సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

హైదరాబాద్
శనివారం 28.03.2026

@mudranews mudratv

సంపుటి: 13 సంచిక: 155
పేజీలు: 12 వెల: రూ. 5

## పోరాట స్ఫూర్తికి ప్రతీక ఐజేయూ

4

- విజయవాడలో ఐజేయూ 11వ ప్లీనరీకి రంగం సిద్ధం...
- దేశవ్యాప్తంగా జర్నలిస్టుల దృష్టి
- పాత్రికేయ హక్కుల కోసం మూడు దశాబ్దాల పోరాటం...
- ఐజేయూ మరో కీలక ఘట్టం వైపు
- పెయిడ్ న్యూస్ నుంచి లేబర్ కోడ్స్ వరకు... మీడియా రంగ సమస్యలపై ఐజేయూ గళం
- జర్నలిస్టుల భద్రత, సంక్షేమం కోసం జాతీయ స్థాయి పోరాటాలకు సిద్ధమవుతున్న ఐజేయూ
- విజయవాడ వేదికగా భవిష్యత్ కార్యాచరణకు రూపురేఖలు...




# కన్నుల పండువగా రాములోరి కల్యాణం

- శ్రీరామనవమి వేళ భద్రాచలంలో వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం
- సీఎం రేవంత్ రెడ్డి దంపతులు సమర్పించిన పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు
- భక్తుల జయజయధ్వానాల మధ్య మిథిలా మండపంలో ఘనంగా కళ్యాణ క్రతువు
- లక్షలాది భక్తులతో కిటకిటలాడిన భద్రాచలం.. పోలీసుల భారీ బందోబస్తు
- రూ.351 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన.. పోచంపల్లి చీరల ప్రత్యేకత


ముద్ర, భద్రాచలం :

శ్రీరామ నామస్మరణతో భద్రాద్రి గిరులు ప్రతిధ్వనించాయి. మంగళవాయిద్యాల మోత, వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య 'తెలంగాణ అయోధ్య' భద్రాచల క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో పులకించిపోయింది. అభిజిత్ లగ్నాన లోకపావని సీతమ్మ శిరస్సుపై రామయ్య పెళ్లి కుమారుడై ముత్యాల తలంబ్రాలు పోస్తుంటే.. ఆ అద్భుత ఘట్టాన్ని వీక్షించిన లక్షలాది భక్తుల కళ్లు భక్తి పారవశ్యంతో చెమర్చాయి. ముక్కోటి దేవతలు మురిసిపోయేలా భక్తజనం తన్మయత్వంతో పులకించేలా జరిగిన ఈ జగదభిరాముని కల్యాణ మహోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. అటు భక్తి, ఇటు వైభవం మేళవించిన ఈ వేడుక భద్రాద్రి చరిత్రలో మరో సువర్ణ అధ్యాయంగా నిలిచిపోయింది.



9

# చమురు కంపెనీలకే ఎక్సైజ్ లాభం




9

- సామాన్యుడి జేబుకు అందని ఇంధన ఊరట!
- ఎక్సైజ్ తగ్గించినా ప్రజలకు ఉపశమనం దూరం
- పన్ను తగ్గింపుతో ఆయిల్ కంపెనీలకు ఊరట
- ఇంధన ధరలు యథాతథం.. సామాన్యుడికి లాభం లేదు
- కేంద్ర నిర్ణయం వెనుక అంతర్జాతీయ ఒత్తిడి ప్రభావం
- పెట్రోల్ చవక కాదు.. కంపెనీల నష్టాల భర్తీకి మార్గం

ముద్ర, తెలంగాణ బ్యూరో :

అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడిచమురు ధరలు, అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై అదనపు ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ పన్ను కోత వల్ల లీటరుకు రూ. 10 నుంచి రూ. 13 వరకు ఉపశమనం లభించినప్పటికీ, సామాన్య వినియోగదారుడికి మాత్రం పెట్రోల్ ధరల తగ్గింపు ఫలాలు అందడం లేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లు దాటడంతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఎదుర్కొంటున్న భారీ నష్టాలను భర్తీ చేసుకునేందుకే ఈ తగ్గింపును వినియోగించనున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా పన్నులు తగ్గినా పంపు వద్ద ధరలు మాత్రం యథాతథంగా ఉండటంతో సామాన్యుడికి నిరాశే ఎదురవుతోంది.



# యుద్ధానికి బ్రేక్

- మరో 10 రోజులు విరామం
- గడువుపెంచిన అమెరికా అధ్యక్షుడు
- మరో వైపు ఖర్గే ద్వీపం స్వాధీనానికి యత్నాలు
- అప్రమత్తమైన ఇరాన్.. ద్వీపం చుట్టూ మందుపాతరల అమరిక
- భూతల యుద్ధానికి 10 లక్షల మంది సైన్యంతో ఇరాన్ రెడీ
- సైనిక చర్యలు ఆపని ట్రంప్.. రంగంలోకి డ్రోన్ బోట్లు


9

అమెరికా అధ్యక్షుడు 10 రోజుల పాటు యుద్ధ విరామం ప్రకటించినప్పటికీ, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మాత్రం చల్లారడం లేదు. ఒకవైపు శాంతి ప్రయత్నాలు జరుగుతున్నట్లు కనిపిస్తున్నా, మరోవైపు వ్యూహాత్మక ప్రాంతమైన ఖర్గే ద్వీపం చుట్టూ యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ద్వీపాన్ని కాపాడుకునేందుకు ఇరాన్ ఏకంగా 10 లక్షల మంది సైన్యాన్ని రంగంలోకి దించడమే కాకుండా, భారీగా మందుపాతరలను అమర్చి 'భూతల యుద్ధానికి' సిద్ధమైంది. అటు అమెరికా కూడా తన పట్టు వదలకుండా అత్యాధునిక 'డ్రోన్ బోట్లను' వినియోగిస్తూ కయ్యానికి కాలుదువ్వుతోంది. దీంతో ఈ 10 రోజుల విరామం కేవలం ప్రశాంతత కోసమా లేక పెను తుపాను ముందున్న నిశ్శబ్దమా అన్నది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## బీసీ రాజ్యాధికారం దిశగా 'తీన్మార్' వ్యూహం

- జూన్ 2 నుంచి రాష్ట్రవ్యాప్త పాదయాత్ర
- క్షేత్రస్థాయిలో బీసీ వర్గాల బలోపేతానికి ప్రణాళిక

9




# గులాబీ బాస్ కోటలో సొంత బిడ్డ సర్జికల్ స్ట్రైక్!

## 'తెలంగాణ ప్రజా జాగృతి' వచ్చేస్తోంది

- కవిత కొత్త పార్టీతో గులాబీ గూటిలో గుబులు...
- బీఆర్ఎస్ ఓటు బ్యాంకుపై కవిత కన్ను...
- ఏప్రిల్ 25న 'తెలంగాణ ప్రజా జాగృతి' ఆవిర్భావం...
- మేడ్చల్‌లో భారీ సభకు ఏర్పాట్లు పూర్తి
- కవిత ఎంట్రీతో పార్టీ భవిష్యత్‌పై ప్రశ్నలు
- అసంతృప్త నేతలకు కవిత వేదిక...
- బీఆర్ఎస్ నుంచి వలసలపై ఊహాగానాలు
- కేసీఆర్ మౌనం, కేటీఆర్ ఆధిపత్యం...అంతర్గత విభేదాలు బహిర్గతం అవుతున్నాయా?
- మహిళా సాధికారత, కొత్త తరం నాయకత్వమే లక్ష్యం...
- జాగృతి అజెండాపై ఆసక్తి

ముద్ర, తెలంగాణ బ్యూరో :

కవిత కొత్త పార్టీకి ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. వచ్చే నెలలో కొత్త రాజకీయ పార్టీ పురుడు పోసుకోనుంది. మేడ్చల్‌లోని అద్వయ కన్వేషన్ లో నిర్వహించే పార్టీ ఆవిర్భావ సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని జాగృతి అధ్యక్షురాలు కవిత పిలుపునిచ్చారు. ఏప్రిల్ 25న ఉదయం 8 గంటలకే కార్యకర్తలు, నాయకులు చేరుకోవాలని నిజామాబాద్ ప్రెస్ మీట్ లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కోరారు. కాగా, కవిత పార్టీ పేరు తెలంగాణ ప్రజా జాగృతి గా ఖరారు చేసినట్లు తెలిసిందే. కవిత కొత్త పార్టీతో బీఆర్ఎస్ పార్టీకి పెను సమస్యలు రానున్నాయి. కవిత పార్టీ చీల్చే ఓట్లన్నీ బీఆర్ఎస్ పార్టీవే అవుతాయన్న అంచనాలు ఉన్నాయి.

**రాజకీయ రచ్చ**

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఒక పెను సంచలనం ముంచుకొస్తోంది.

..మిగతా 2లో



2

# మోడీని పొగిడిన ట్రంప్.. ఏంటి కథ?

- మేమిద్దరం చేతల మనుషులం" అన్న ట్రంప్
- భారత్-అమెరికా బంధం బలోపేతం దిశగా ట్రంప్ కీలక వ్యాఖ్యలు
- పశ్చిమాసియా ఉద్రిక్తతల మధ్య మోదీ-ట్రంప్ సంభాషణ..
- సంబంధాలపై ఆశాభావం

## ఐపీఎల్ డిమాండ్స్..

- ప్రతీ ఎమ్మెల్యేకు 5 టికెట్స్ కావాలంట..
- ప్రజా సమస్యల మధ్య ఎమ్మెల్యేల టికెట్ డిమాండ్‌పై విమర్శల వెల్లువ

2



## ఆర్సీబీ వర్సెస్ సన్‌రైజర్స్.. గెలుపెవరిది?

- బెంగళూరు ఫామ్ కొనసాగుతుందా.. హైదరాబాద్ సర్ప్రైజ్ ఇస్తుందా?
- చిన్నస్వామి వేదికగా హోరాహోరీ పోరు
- జత్ పాటిదార్ vs ఇషాన్ కిషన్ నాయకత్వ పోరు
- హెడ్ టు హెడ్‌లో హైదరాబాద్ ఆధిక్యం.. బెంగళూరు ప్రతీకారం?
- పరుగుల వరదకు వేదిక సిద్ధం
- రికార్డుల మ్యాచ్ మళ్లీ పునరావృతమవుతుందా?
- రెండు జట్ల బలబలాలు ఇవీ?

11



## మిల్లెట్ ఉప్మా.. పూరీ.. దోసె.. బొండా

3

- ఇదీ సర్కారు మెనూ
- ప్రభుత్వ బడిలో బ్రేక్ ఫాస్ట్ లిస్ట్
- 5 రకాల టిఫిన్‌లతో మెనూ.. ఐటెమ్స్ లిస్ట్ ఫైనల్
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు
- ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు

## డీపీఆర్ రెడీ చేసుకోండి

- రీజినల్ రింగు రోడ్డు దక్షిణ భాగంపై అప్డేట్
- మంత్రి కోమటిరెడ్డికి నితిన్ గడ్కరీ లేఖ
- డీపీఆర్ తయారీకి కన్సల్టెన్సీని అపాయింట్
- త్వరలోనే పూర్తిస్థాయి నివేదిక




3



## బీరు షాక్..

- బీర్ల ధరల పెంపునకు చాన్స్
- తయారీ ఖర్చులు పెరిగాయి
- ప్రభుత్వానికి కంపెనీల ప్రతిపాదనలు
- ఒక్కో కేసుపై రూ. 35 వరకు పెరిగే అవకాశం

10




## ఇదీ ఏఐ ముద్ర

పెట్రోల్, డీజిల్ బంగారమైంది.. అందుకే జనాలు ఇప్పుడు పొదుపుగా వాడుతున్నారు. పెట్రోల్, డీజిల్ ను ఎలా ఆదా చేయాలో మల్లగుల్లాలు పడుతున్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
28.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





**పెట్రోల్, డీజిల్ ఆదా కోసం స్థిర వేగంతో డ్రైవ్ చేయండి**

తరచూ వేగం పెంచడం, తగ్గించడం వల్ల ఇంధనం ఎక్కువగా ఖర్చవుతుంది. కాబట్టి స్మూత్‌గా, ఒకే స్పీడ్‌లో డ్రైవ్ చేయడం మంచిది.

# గులాబీ బాస్ కోటలో సొంత బిడ్డ సర్జికల్ స్ట్రైక్!

(మొదటి పేజీ తరువాయి)

కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ అస్తిత్వం కోసం తెలంగాణ ప్రజా జాగృతి పేరిట కొత్త పార్టీని ప్రకటిస్తున్నారు. ఈ పరిణామం కేవలం ఒక కొత్త పార్టీ ఆవిర్భావం మాత్రమే కాదు, బీఆర్ఎస్ పార్టీ పునాదులను కదిలించే ఒక వ్యూహాత్మక చీలికగా చెప్పుకోవచ్చు.

కవిత కొత్త పార్టీకి ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. వచ్చే నెలలో కొత్త రాజకీయ పార్టీ పురుడు పోసుకోనుంది. మేడ్చల్ లోని అద్వయ కన్వేషన్ లో నిర్వహించే పార్టీ ఆవిర్భావ సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని జాగృతి అధ్యక్షురాలు కవిత పిలుపునిచ్చారు. ఏప్రిల్ 25న ఉదయం 8 గంటలకే కార్యకర్తలు, నాయకులు చేరుకోవాలని నిజామాబాద్ ప్రెస్ మీట్ లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కోరారు. కాగా, కవిత పార్టీ పేరు తెలంగాణ ప్రజా జాగృతి గా ఖరారు చేసినట్లు తెలిసిందే. కవిత కొత్త పార్టీతో బీఆర్ఎస్ పార్టీకి పెను సమస్యలు రానున్నాయి. కవిత పార్టీ చీల్చే ఓట్లన్నీ బీఆర్ఎస్ పార్టీవే అవుతాయన్న అంచనాలు ఉన్నాయి.

**రాజకీయ రచ్చ**

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఒక పెను సంచలనం ముంచుకొస్తోంది. కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ అస్తిత్వం కోసం తెలంగాణ ప్రజా జాగృతి పేరిట కొత్త పార్టీని ప్రకటిస్తున్నారు. ఈ పరిణామం కేవలం ఒక కొత్త పార్టీ ఆవిర్భావం మాత్రమే కాదు, బీఆర్ఎస్ పార్టీ పునాదులను కదిలించే ఒక వ్యూహాత్మక చీలికగా చెప్పుకోవచ్చు.

**బీఆర్ఎస్ ఓటు బ్యాంకుకు సర్జికల్ స్ట్రైక్**

తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ఉన్న అత్యంత బలమైన ఓటు బ్యాంకులో చీలిక తేవడమే కవిత ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది. ఒక కొత్త పార్టీగా కవిత కేవలం 4 నుండి 5 శాతం ఓట్లను చీల్చగలిగినా, అది బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదకరంగా మారనుంది. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో దెబ్బతిన్న బీఆర్ఎస్, ఇప్పుడు కవిత రూపంలో ఎదురవుతున్న ఈ ఇంటి పోరు ను తట్టుకోవడం కష్టతరమే. ముఖ్యంగా తెలంగాణ సెంటిమెంట్, సాంస్కృతిక అంశాలపై పట్టున్న కవిత, బీఆర్ఎస్ కోర్ ఓటర్లను తనవైపు తిప్పుకుంటే ఆ పార్టీ కోలుకోవడం అసాధ్యం కావచ్చు.

**అసంతృప్త నేతలకు జాగృతి ఆశ్రయం**

బీఆర్ఎస్ పార్టీలో ప్రస్తుతం కేటీఆర్ ఆధిపత్యం పెరిగిందని, సీనియర్లకు ప్రాధాన్యత తగ్గటంపై లోలోపల తీవ్ర అసంతృప్తి నెలకొంది. కేసీఆర్ మౌనం, హరీష్ రావు ఇరకాటం వంటి పరిస్థితులతో .. పార్టీలో గుర్తింపు లేని ద్వితీయ శ్రేణి నాయకులు, టిక్కెట్లు దక్కని ఆశావాహులు ఇప్పుడు కవిత వైపు చూస్తున్నారు. కవిత పార్టీ ప్రకటన వెలువడగానే, బీఆర్ఎస్ నుండి భారీగా వలసలు ఉంటాయని ప్రచారం జరుగుతోంది. అవకాశాలు రాని నేతలకు కవిత ఒక ప్రత్యామ్నాయ వేదికగా మారడం బీఆర్ఎస్ క్యాడర్‌ను నిలువునా చీల్చనుంది.

**కుటుంబంలో చీలిక - ఇరకాటంలో కేసీఆర్**

కేటీఆర్, హరీష్ రావుల తీరుపై గుర్రుగా ఉన్న కవిత, తనపై జరిగిన రాజకీయ కుట్రలకు ప్రతీకారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ కవితతో సర్దుకుపోయే ప్రసక్తే లేదని సంకేతాలిస్తుంటే, అటు తండ్రిగా కేసీఆర్ వారించలేక, ఇటు పార్టీని కాపాడుకోలేక మౌనం వహిస్తున్నారు. ఈ అంతర్గత కలహాలు బీఆర్ఎస్ బలహీనపడటానికి ప్రధాన కారణం కానున్నాయి. కవిత పార్టీ పెట్టడం వెనుక ఉన్న బలమైన ఉద్దేశ్యం అధికారం కంటే కూడా, తనను దూరం పెట్టిన బీఆర్ఎస్ నేతలకు ఒక గట్టి పాఠం చెప్పడమేనని అర్థమవుతోంది.

**రాజకీయ సమీకరణాల్లో మార్పులు**

కవిత చేయబోయే అధికారిక ప్రకటనతో తెలంగాణలో సరికొత్త సమీకరణాలు మొదలవుతాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్ నుండి బయటపడిన తర్వాత బాధితురాలిగా ప్రజల్లోకి వెళ్లాలని ఆమె యోచిస్తున్నారు. వ్యక్తిగా వెళ్తున్నాను.. రాజకీయ శక్తిగా తిరిగి వస్తాను అన్న ఆమె నినాదం ఇప్పుడు బీఆర్ఎస్ అధినాయకత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కవిత చీల్చే ప్రతి ఓటు కూడా బీఆర్ఎస్ విజయవకాశాలను దెబ్బతీస్తూ, పరోక్షంగా ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూర్చే అవకాశం ఉంది. ఈ సమస్యను అధిగమించే పరిష్కారం బీఆర్ఎస్ వద్ద కనిపించడం లేదు.

**ప్రకటించిన కవిత**

తెలంగాణ గడ్డపై మరో కొత్త పార్టీ ఏర్పాటుకు రంగం సిద్ధం అయింది. ఎప్పటి నుంచో పార్టీ పెట్టనున్నట్లు తెలిపిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత .. తాజాగా దానికి సంబంధించి కీలక విషయాలను వెల్లడించారు. పార్టీ ఆవిర్భావం, జెండా, అజెండా, విధి విధానాలను ఏప్రిల్ 25వ తేదీన వెల్లడిస్తామని.. తాజాగా కవిత స్పష్టం చేశారు. ఏప్రిల్ 25వ తేదీన మంచి ముహూర్తం ఉందని.. అందుకే ఆ రోజున పార్టీని ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. శ్రీరామనవమి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు చెప్పిన కల్వకుంట్ల కవిత.. తన సొంత రాజకీయ పార్టీపై తాజాగా నిజామాబాద్ జాగృతి కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక ప్రకటన చేశారు. తన కొత్త పార్టీపై కల్వకుంట్ల కవిత తాజాగా ప్రకటన చేశారు. పార్టీ ఏర్పాటుకు ముహూర్తాన్ని ఫిక్స్ చేశారు. వచ్చే నెల 25వ తేదీన తన కొత్త పార్టీ ప్రారంభోత్సవం ఉంటుందని వెల్లడించారు. పార్టీ ఆవిర్భావం రోజున తెలంగాణ జాగృతి కార్యకర్తలు, తెలంగాణ సమాజం భారీ ఎత్తున తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా.. ప్రజలకు అండగా నిలవలేదని.. కొత్త రాజకీయ పార్టీ అవసరం వచ్చిందని.. అందుకే తాను పార్టీ పెడుతున్నట్లు తెలిపారు. ఇక తన పార్టీని ఎక్కడ ప్రారంభించేది అనే విషయాన్ని కూడా కల్వకుంట్ల కవిత వెల్లడించారు. హైదరాబాద్ నగర శివారులోని మేడ్చల్ జిల్లా మునీరాబాద్ గ్రామంలోని అద్వయ కన్వెన్షన్ హాల్‌లో భారీ సభను ఏర్పాటు చేసి ముహూర్తం ప్రకారం ఉదయం 10 గంటలకు పార్టీ ఆవిష్కరణ, జెండా విడుదల చేయనున్నట్లు కవిత స్పష్టం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ నంబర్ 6 వద్ద ఉన్న 20 ఎకరాల భారీ స్థలంలో ఈ సభను నిర్వహించనున్నట్లు కవిత స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా పార్టీ ఏర్పాటుకు సంబంధించి.. ఏప్రిల్ 25వ తేదీ లోపు సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామని కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఇక తాము ఎవరి నుంచైనా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని.. దానికి సంబంధించిన వాట్సాప్ నంబర్‌ను కూడా త్వరలోనే ఇస్తామని వెల్లడించారు. ఇక తమ పార్టీ ఆవిర్భావ సభకు నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, తెలంగాణ ప్రజలు భారీ ఎత్తున తరలిరావాలని కవిత విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో మార్పు కావాలని కోరుకునే వారంతా తనతో కలిసి రావాలని ఆమె కోరారు.

ఈ నేపథ్యంలోనే తమ కొత్త పార్టీలో.. కొత్త తరం నాయకత్వానికి, మరీ ముఖ్యంగా మహిళా సాధికారతకు పెద్దపీట వేయనున్నట్లు కవిత స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ కారుల ఆశయాలకు అనుగుణంగా.. ప్రొఫెసర్ జయశంకర్ మార్గంలో తమ పార్టీ పనిచేస్తుందని కవిత వెల్లడించారు. ఇక నిజామాబాద్ కోడలిగా పార్టీ ప్రకటనకు సంబంధించిన విషయాన్ని అక్కడ చెప్పానని పేర్కొన్న కవిత.. ఎన్నికల్లో ఎక్కడ పోటీ చేయాలి అనే విషయంపై పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత క్లారిటీ ఇస్తామని చెప్పారు.



## మోడీని పొగిడిన ట్రంప్.. ఏంటి కథ?

**"మేమిద్దరం చేతల మనుషులం"**

- **భారత్-అమెరికా బంధం బలోపేతం దిశగా ట్రంప్ కీలక వ్యాఖ్యలు**
- **పశ్చిమాసియా ఉద్రిక్తతల మధ్య మోదీ-ట్రంప్ సంభాషణ..**
- **సంబంధాలపై ఆశాభావం**

**ముద్ర డెస్క్ :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసల వర్షం కురిపించడం అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. "మోదీ, నేనూ చేతల మనుషులం" అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు భారత్‌అమెరికా సంబంధాల దృఢతను మరోసారి ప్రతిబింబించాయి. ఈ వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే కాకుండా రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంకేతంగా కూడా భావిస్తున్నారు రాజకీయ విశ్లేషకులు. ట్రంప్ మాట్లాడుతూ ప్రపంచ రాజకీయాల్లో మాటల కంటే చేతలే ముఖ్యమని ఆ విషయంలో తాను, మోదీ ఒకే తత్వాన్ని పంచుకుంటున్నామని చెప్పారు. "ఇలాంటి లక్షణాలు ప్రతి నాయకుడికి ఉండవు" అని వ్యాఖ్యానించడం ద్వారా ఆయన మోదీ నాయకత్వాన్ని ప్రత్యేకంగా కొనియాడారు. రానున్న కాలంలో భారత్‌తో అమెరికా సంబంధాలు మరింత బలపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలను భారత్‌లోని అమెరికా రాయబారి కార్యాలయం అధికారిక 'ఎక్స్' వేదికగా పంచుకోవడం విశేషం. ఇక ఇటీవల జరిగిన పరిణామాలను పరిశీలిస్తే రెండు రోజుల క్రితం ట్రంప్, మోదీ మధ్య కీలక టెలిఫోన్ సంభాషణ జరిగిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హర్మ్యూజ్ జలసంధి భద్రత వంటి అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. ఈ విషయాన్ని భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ కూడా 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. హర్మ్యూజ్ జలసంధి అంతర్జాతీయ చమురు రవాణాలో కీలక పాత్ర పోషిస్తుంది. అక్కడి పరిస్థితులు ఉద్రిక్తంగా మారితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఆ మార్గాన్ని ఎప్పటికప్పుడు తెరిచి ఉంచడం అత్యవసరమని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై భారత్ కూడా సానుకూల వైఖరిని వ్యక్తం చేయడం గమనార్హం. మరోవైపు ఈ సంభాషణపై ప్రధాని మోదీ కూడా స్పందించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించి, శాంతిని పునరుద్ధరించేందుకు భారత్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం సమిష్టి కృషి అవసరమని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా చూస్తే ట్రంప్ చేసిన వ్యాఖ్యలు, తాజా టెలిఫోన్ సంభాషణలు.. అన్ని కలిపి భారత్‌అమెరికా సంబంధాలు మరింత బలపడే దిశగా సాగుతున్నాయని స్పష్టమవుతోంది. మారుతున్న ప్రపంచ రాజకీయ పరిస్థితుల్లో ఈ భాగస్వామ్యం కీలకంగా మారనున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## రఘురామ రాకను అడ్డుకున్న దళితసంఘాలు..

**ఆకివీడులో ఉద్రిక్తత**

**ముద్ర , డెస్క్ :**

పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం పెద్దపేటలో ఉద్రిక్తత నెలకొంది. శిథిలావస్థకు చేరిన రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా పూజలు నిర్వహించేందుకు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు వెళ్లారు. ఆయన రాకను వ్యతిరేకిస్తూ.. దళిత సంఘాలు ఆందోళనకు దిగాయి. శిథిలావస్థకు చేరిన ఆలయం స్థానంలో నూతన గుడిని కట్టిస్తామని రఘురామ ఇటీవల ప్రకటించారు. అయితే, ఆ ప్రాంతంలో గుడి నిర్మించవద్దని, గొంతెనమ్మ ఆలయం కట్టాలని దళిత సంఘాలు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు శ్రీరామనవమి వేళ పూజలో కూర్చున్న రఘురామను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసుల సహకారంతో గుడి లోపలకి వెళ్లి పూజలు చేసిన తర్వాత... రఘురామ వెళ్లిపోయారు. అనంతరం రామాలయం కట్టాలంటున్నవారు.. వ్యతిరేకిస్తున్న దళితవర్గాలు పరస్పరం రాళ్లు రువ్వుకొని దాడులు చేసుకున్నారు. పోలీసులు వారిని అదుపు చేశారు.

## ఖమ్మంబస్తర్ కారిడార్ ను నాలుగు లైన్లుగా విస్తరించండి

- **కేంద్రానికి ఎంపీ వద్దిరాజు విజ్ఞప్తి**

**ముద్ర, న్యూ ఢిల్లీ :**

తెలంగాణ, మధ్య భారతానికి వ్యూహాత్మక జీవనాధారమైన ఖమ్మం బస్తర్ కారిడార్‌ను వెంటనే నాలుగు లేన్లుగా విస్తరించాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు.తూర్పు తెలంగాణ, దానిని ఆనుకుని ఉన్న ప్రాంతాలలో అనుసంధానం, భద్రత,ఆర్థికాభివృద్ధిపై ప్రత్యక్షంగా ప్రభావం చూపే ఒక కీలకమైన మౌలిక సదుపాయాల లోపం గురించి దృష్టి సారించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హై స్పీడ్ కారిడార్ల ద్వారా హైదరాబాద్ నుండి ఖమ్మం వరకు ఉన్న రహదారి మార్గంలో గణనీయమైన అభివృద్ధి కనిపిస్తోందన్నారు.అయితే, ఖమ్మం వెలుపల కొత్తగూడెంభద్రాచలం ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతాల అనుసంధానం నిర్లక్ష్యానికి గురైందన్నారు. వ్యూహాత్మకంగా ఇది అత్యంత కీలకమైన ఒక జీవనాడి అని, దీనిని ఒడిషా వైపు కూడా అనుసంధానం చేయొచ్చని ఎంపీ రవిచంద్ర తెలిపారు.రాజ్యసభలో శుక్రవారం ఆయన జీరో అవర్ లో మాట్లాడారు.ఈ కారిడార్ కేవలం ఒక రహదారి మాత్రమే కాదని,ఇది తెలంగాణ ఛత్తీస్‌గఢ్‌ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానించే వ్యూహాత్మకమైనదని చెప్పారు. ఈ నెట్‌వర్క్‌కు కొత్తగూడెం కేంద్ర బిందువుగా ఉంటుందన్నారు. సింగరేణి బొగ్గు క్షేత్రాలు, థర్మల్ విద్యుత్



ప్లాంట్లు, ప్రధాన పరిశ్రమలకు నిలయమైన కొత్తగూడెంపాల్వంచలు తెలంగాణ పారిశ్రామిక, ఇంధన వెన్నెముకగా ఉన్నాయని ఎంపీ రవిచంద్ర చెప్పారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్నా కూడా ఖమ్మం దాటాక ఈ ప్రాంతంలో రహదారి మౌలిక సదుపాయాలు సరిగా లేవని ఎంపీ రవిచంద్ర కేంద్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.ఈ ప్రాంతం గుండా వెళ్లే వాహనాలు తరుచూ ట్రాఫిక్ రద్దీలో చిక్కుకోవాల్సి వస్తున్నదని వివరించారు.ఖమ్మంకొత్తగూడెంభద్రాచలంబస్తర్ కారిడార్ ను వెంటనే నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నాలుగు లేన్ల కారిడార్ కొత్తగూడెంను త్రిరాష్ట్ర లాజిస్టిక్స్ కేంద్రంగా రూపుదాల్చి రాష్ట్రాల మధ్య బొగ్గు,ఖనిజాలు, అటవీ ఉత్పత్తులు, పారిశ్రామిక వస్తువుల నిరాటంక రవాణాను సులభతరం చేస్తుందని ఎంపీ వద్దిరాజు వివరించారు.

ఈ రహదారి అత్యంత గిరిజన, వెనుకబడిన ప్రాంతాల గుండా వెడుతుందని, ఈ అనుసంధానాన్ని బలోపేతం చేయడం ద్వారా ఈ వర్గాలను ప్రధాన ఆర్థిక వ్యవస్థలో ఏకీకృతం చేయొచ్చని,విద్య, ఆరోగ్య సంరక్షణ, మార్కెట్లను మరింత మెరుగుపరుస్తుందని చెప్పారు బస్తర్,సుక్మా వైపు విస్తరించి ఉన్న ప్రాంతాలతో సహా ఇది నక్సల్ ప్రభావిత ప్రాంతమని, మౌలిక సదుపాయాలు కేవలం అభివృద్ధి మాత్రమే కాదు అని,అవి భద్రతా దళాలకు, పరిపాలనకు, స్థిరత్వానికి ఒక వ్యూహాత్మక అవసరం అని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. అదనంగా ఈ కారిడార్ హైదరాబాద్ నుండి బస్తర్ అనుసంధాన్ని మరింత బలోపేతం చేసి, దీనిని ప్రత్యక్ష ఆర్థిక, మానవతా జీవనాడిగా మారుస్తుందని ఆయన వివరించారు. ఇప్పటికే ఖమ్మం వరకు పటిష్టమైన కారిడార్లను నిర్మించామని, అత్యంత కీలకమైన లోపించిన అనుసంధానాన్ని బలోపేతం చేయడం ద్వారా ఈ దార్శనికతను పూర్తి చేయాల్సి ఉందని ఎంపీ రవిచంద్ర అభిప్రాయపడ్డారు.ఈ కారిడార్ ఆర్థిక, సామాజిక వ్యూహాత్మక ప్రాముఖ్యతను గుర్తించి, దీనిని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం తగు ప్రాధాన్యతనిచ్చి అనుమతులు మంజూరు చేయాల్సిందిగా ఆయన కోరారు. దీంతో,మూడు రాష్ట్రాల అనుసంధానానికి, అభివృద్ధికి కొత్తగూడెం కేంద్ర బిందువుగా ఆవిర్భవిస్తుందని ఎంపీ వద్దిరాజు వివరించారు.

## ఐపీఎల్ డిమాండ్స్.. ప్రతీ ఎమ్మెల్యేకు 5 టికెట్స్ కావాలంట..

- **ప్రజా సమస్యల మధ్య ఎమ్మెల్యేల టికెట్ డిమాండ్‌పై విమర్శల వెల్లువ**
- **"మేము వీఐపీలం" వ్యాఖ్యలతో రాజకీయం వేడెక్కించిన కాశప్పనవర్**
- **ఐపీఎల్ టికెట్లపై అసెంబ్లీ దాకా వెళ్లిన వివాదం**
- **బ్లాక్ మార్కెట్ ఆరోపణలు – అభిమానులకు దక్కని మ్యాచ్ టికెట్లు**
- **వీఐపీ సంస్కృతి vs సమానత్వం – దేశవ్యాప్తంగా మళ్లీ చర్చ**

**ముద్ర డెస్క్ :**

దేశవ్యాప్తంగా ఇంధనం, గ్యాస్ కొరతలపై చర్చలు జరుగుతున్న ఈ సమయంలో, ప్రజలు నిత్యావసరాల కోసం ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కర్ణాటకలో ఒక కొత్త వివాదం తెరపైకి వచ్చింది. ముఖ్యంగా బెంగళూరులో గ్యాస్ కొరత కారణంగా కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాల్సిన ప్రజాప్రతినిధులు మాత్రం వేరే అంశంపై మాట్లాడటం విమర్శలకు దారితీస్తోంది. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయానంద్ కాశప్పనవర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు కారణమయ్యాయి. మార్చి 28న బెంగళూరులో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్ ఆర్‌సీబీ వర్సెస్ ఎస్ఆర్‌హెచ్ నేపథ్యంలో ఆయన చేసిన డిమాండ్ రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. ప్రతి ఎమ్మెల్యేకు కనీసం ఐదు ఐపీఎల్ టికెట్లు ఇవ్వాలని, అంతేకాకుండా ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. "మేము వీఐపీలం. సామాన్య ప్రజలతో కలిసి క్యూలో నిలబడటం మాకు సాధ్యం కాదు" అని కాశప్పనవర్ స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులుగా తమకు ప్రత్యేక గౌరవం, సౌకర్యాలు ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యేలు తమ బాధ్యతలు నిర్వహిస్తున్న సందర్భంలో ఇలాంటి సదుపాయాలు అవసరమని ఆయన వాదించారు.

ఇక ఈ అంశాన్ని కర్ణాటక అసెంబ్లీలో కూడా ప్రస్తావించినట్లు కాశప్పనవర్ తెలిపారు. కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) ఎమ్మెల్యేలను గౌరవించడం లేదని, టికెట్ల పంపిణీలో సరైన పారదర్శకత లేదని ఆయన ఆరోపించారు. మరోవైపు టికెట్లు బ్లాక్ మార్కెట్‌లో రూ. 5,000 నుంచి రూ. 35,000 వరకు అమ్ముడవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల సాధారణ అభిమానులు మ్యాచ్‌లను ప్రత్యక్షంగా చూడలేకపోతున్నారని కూడా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంపై స్పందించిన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మ్యాచ్ ప్రారంభానికి ముందే ఎమ్మెల్యేలకు టికెట్లు అందేలా చూస్తామని చెప్పారు. అయితే ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా "వీఐపీ సంస్కృతి"పై పెద్ద చర్చకు దారితీశాయి. ప్రజలచే ఎన్నుకోబడిన నాయకులు ప్రజలతో సమానంగా ఉండాలా? లేక వారి హోదాకు అనుగుణంగా ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలా? అనే ప్రశ్నలు మళ్లీ ముందుకు వచ్చాయి. ఒక వర్గం ప్రజాప్రతినిధులకు కొన్ని ప్రత్యేక సౌకర్యాలు అవసరమని సమర్థిస్తుండగా మరొక వర్గం ఇది సమానత్వ సూత్రానికి విరుద్ధమని విమర్శిస్తోంది. ఐపీఎల్ వంటి భారీ ప్రజాదరణ పొందిన క్రీడా వేడుకలు కేవలం వినోదానికే కాకుండా, సామాజిక, రాజకీయ చర్చలకు కూడా వేదికగా మారుతున్నాయని ఈ ఘటన స్పష్టంగా చూపిస్తోంది. బెంగళూరులో జరగనున్న ఈ మ్యాచ్‌పై ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో, ఈ వివాదం మరింత చర్చకు దారి తీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## సజావుగా పెట్రో ఉత్పత్తుల సరఫరా...

- **రాష్ట్ర, జిల్లాల్లోనూ కమిటీల ఏర్పాటు.. నోడల్ ఆఫీసర్ల నియామకం**
- **పీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాకు సంబంధించి సమీక్షకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల పరిస్థితుల నేపథ్యంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం పలు అంశాలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీఎస్ ఆధ్వర్యంలోని కమిటీ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని ప్రధాన మంత్రి మోదీ దృష్టికి తీసుకెళ్లారు. 33 జిల్లాల్లోనూ గ్యాస్ సరఫరా, పెట్రోల్, డీజిల్ విక్రయాలు.. బ్లాక్ మార్కెట్ నిరోధానికి కమిటీలు ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించినట్లు సీఎం తెలిపారు. ప్రాధాన్య క్రమంలో ఆసుపత్రులు, పాఠశాలలు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను పంపుతున్నట్లు సీఎం వెల్లడించారు. ప్రతి బంక్‌లో స్టాక్ ఎంత ఉంది.. ఎంత వినియోగిస్తున్నారనే దానిపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని సీఎం తెలిపారు. తెలంగాణలో సాధారణ రోజుల్లో రోజుకు 36,189 కిలో లీటర్ల పెట్రోల్, డీజిల్ వినియోగం జరుగుతుందని, ప్రస్తుతం 1,88,210 కిలోలీటర్ల నిల్వలు ఉన్నట్లు సీఎం వివరించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై సోషల్ మీడియాలో అపోహలు, భయాందోళనలు కలిగేలా పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం తెలిపారు. తెలంగాణలో శిలాజ ఇంధనాలపై (బొగ్గు, చమురు, గ్యాస్) ఆధారపడడం తగ్గించి ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని.. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి పెంచుతున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో ఈవీలపై వంద శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయించామన్నారు. ఈవీల తయారీ, బ్యాటరీ ఎకోసిస్టమ్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పీఎం మోదీ దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో 1.20 లక్షకుపైగా ఉన్న పెట్రోల్, డీజిల్ ఆటోలను రిట్రోఫిట్టింగ్ ద్వారా ఈవీలుగా మార్చే ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీలో ఇక ముందు అన్ని ఈవీ బస్సులనే వినియోగించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
28.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews

3 జనరల్ న్యూస్
GENERAL NEWS

పెట్రోల్, డీజిల్ ఆదా కోసం..
అనవసర ఐడ్లింగ్‌ను తగ్గించండి
వాహనం నిలిపి ఉంచినప్పుడు ఇంజిన్ ఆఫ్ చేయండి. ఐడ్లింగ్‌లో కూడా ఇంధనం వృథా అవుతుంది.





## హిందూ పండుగలపై ఎస్పీ ఆంక్షలు

- కోర్టును ఆశ్రయించాల్సిన దుస్థితి
- అసెంబ్లీ లో ప్రివిలేజ్ మోషన్
- బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి

ముద్ర ప్రతినిధి, నిర్మల్:
నిర్మల్ జిల్లాలో పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమైందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నిర్మల్ పట్టణంలో శ్రీ రామ నవమి శోభాయాత్ర ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. హిందూ పర్వదినాల నిర్వహణ, ఊరేగింపుల కోసం కోర్టును ఆశ్రయించాల్సిన దుస్థితి ఎదురవుతుందన్నారు. నిర్మల్ ఎస్పీ వ్యవహార శైలిపై అసెంబ్లీ లో ప్రివిలేజ్ మోషన్ ప్రవేశపెట్టి, ప్రశ్నించనున్నట్లు వెల్లడించారు. శ్రీ రామ నవమిని పురస్కరించుకుని ఊరేగింపునకు సైతం ఆంక్షలు విధిస్తున్నారని చెప్పారు. అన్ని మతాల పర్వదినాలను జరుపుకొనే వెసులుబాటు ఉన్నా హిందువుల పండుగలపై మాత్రమే ఆంక్షలు విధిస్తున్న ఎస్పీ తీరును దుయ్యబట్టారు. బాసర ట్రిపుల్ ఐటీలో బాలికలను ఉద్దేశించి ఆమె మాట్లాడిన మాటలు ఎస్పీ స్థాయిని దిగజార్చేలా ఉన్నాయన్నారు. గతంలో కూడా ఆంజనేయ మాల వేసుకున్న భక్తులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. శ్యాంగఢ్ లో హత్యకు సంబంధించి ఫుటేజ్ ఉన్నా చర్యలు తీసుకోలేదన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే చర్యలను సహించబోమని ఆయన స్పష్టం చేశారు.

### నేటి నుండి అమరావతిలో ఐజేయూ

# జాతీయ 11 వ ప్లీనరీ

- సమావేశాలకు భారీ ఏర్పాట్లు
- ఇప్పటికే తరలి వచ్చిన పలు రాష్ట్రాల ప్రతినిధులు!

ముద్ర, అమరావతి :
దేశంలో అత్యధిక సంఖ్యాక వర్కింగ్ జర్నలిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ 11 వ ప్లీనరీ సమావేశాలు శుక్రవారం అమరావతి లో ప్రారంభమయ్యాయి. 27వ తేదీన తొలి రోజు ఐజేయూ జాతీయ కార్యవర్గం సమావేశమైంది. ఐజేయూ అధ్యక్షుడు కే శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్లీనరీలో చర్చించనున్న వివిధ అంశాలను, ప్రవేశపెట్టనున్న తీర్మానాలను ఖరారు చేశారు. అలాగే ప్లీనరీ సమావేశాలలో సమర్పించనున్న సెక్రటరీ జనరల్ నివేదికను కూడా కార్యవర్గ సమావేశం ఆమోదించింది. సెక్రటరీ జనరల్ బల్విందర్ సింగ్ నివేదికలోని అంశాలను వివరించారు. సంస్థాగతంగా ఐజేయు నిబంధనావళికి చేయనున్న సవరణలను కూడా కార్యవర్గ సమావేశం చర్చించి ఖరారు చేసింది. ఈ సవరణలపై ప్లీనరీలో చర్చించి ఆమోదిస్తారు. ఐజేయూ జాతీయ కార్యవర్గ ఎన్నికలను 29వ తేదీన నిర్వహిస్తారు. యూనియన్ సీనియర్ నాయకుడు ఎమ్ఏ మాజిద్ ను ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కార్యవర్గ సమావేశం నియమించింది.

**ప్లీనరీకి భారీగా ఏర్పాట్లు**

మార్చి 28,29 తేదీల్లో విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రెండు రోజులపాటు ప్లీనరీ జరుగుతుంది. ఈ సమావేశాలకు 25 రాష్ట్రాల నుండి దాదాపు 300 మంది ఎన్నికైన ప్రతినిధులు హాజరవుతున్నారు. 28 వ తేదీ సాయంత్రం 5 గంటలకు ప్లీనరీ సమావేశాలను ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించి ప్రసంగిస్తారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గౌరవ అతిథిగా పాల్గొంటారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు అతిథులుగా హాజరవుతారు. వర్కింగ్ జర్నలిస్టుల జాతీయస్థాయి వృత్తి కార్మిక సంఘంగా ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ 1989 లో ఏర్పడింది. గత 36 సంవత్సరాలుగా దేశంలో భావప్రకటనా స్వేచ్ఛను, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడానికి ఐజేయూ విశేష కృషి చేస్తూ వచ్చింది. ప్రభుత్వాలనుండి, సంఘ వ్యతిరేక శక్తులనుండి మీడియాకు, జర్నలిస్టులకు ఎదురవుతున్న సవాళ్లను ప్రమాదాలను ఎదుర్కోవడంలో ఐజేయూ కీలక భూమిక పోషిస్తూ వచ్చింది. వర్కింగు జర్నలిస్టుల పని పరిస్థితులు, వేతనాలు మెరుగుపరచడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మనీసానా సింగ్ వేజ్ బోర్డును, జి.ఆర్.మాజీథియా వేజ్ బోర్డును ఏర్పాటు చేయించడంలో ఐజేయూ విజయం సాధించింది. వేజ్ బోర్డుల సిఫార్సులను అమలు చేయించేందుకు కూడా పలు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున పోరాడింది. దేశంలో మీడియా పాలసీల రూపకల్పన కోసం జరిగే బహిరంగ చర్చలో తొలి నుండీ ఐజేయు కీలక పాత్ర పోషిస్తున్నది. దేశంలో 27 రాష్ట్రాలలో ఐజేయుకు అనుబంధ సంఘాలు క్రియాశీలంగా పని




చేస్తుండగా ఐజేయూలో దాదాపు ముప్పై వేల మంది జర్నలిస్టులు సభ్యులుగా ఉన్నారు.
మూడు రోజుల సమావేశాల్లో ఐజేయూ జాతీయ అధ్యక్షుడు , తెలంగాణా మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస రెడ్డి, సి.రాఘవాచారి మీడియా అకాడమీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పూర్వ సభ్యులు ఐజేయూ సెక్రటరీ జనరల్ బల్విందర్ సింగ్ జమ్మూ, యూనియన్ సీనియర్ నేతలు , ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పూర్వ సభ్యులు ఎస్.ఎన్.సిన్హా, దేవులపల్లి అమర్, ఎం.ఎ.మాజిద్, ఇటీవల జరిగిన జాతీయ ఎన్నికల్లో ఐజేయూ సెక్రటరీ జనరల్ గా ఎన్నికయిన ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన సీనియర్ పాత్రికేయుడు డి.సోమసుందర్, ఐ జే యూ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, ప్లీనరీ సమావేశాలకు ఆతిథ్యం ఇస్తున్న ఎ.పి.యు.డబ్ల్యు.జే. అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కే.జయరాజ్ తదితరులు పాల్గొంటున్నారు.



## కేసీఆర్ గురువు రమణయ్య మృతి

### సంతాపం తెలిపిన మాజీ సీఎం





ముద్ర ప్రతినిధి, జగిత్యాల:
మాజీ సీఎం కేసీఆర్ గురువు, జగిత్యాలకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు, రిటైర్డ్ లెక్చరర్ డా. జైశెట్టి రమణయ్య శుక్రవారం ఉదయం మృతి చెందారు. తన గురువు రమణయ్య మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా తనకు గురువుగా, అత్యంత ఆత్మీయుడైన రమణయ్యతో ఉన్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. రమణయ్య సిద్ధిపేటలో లెక్చరర్ గా పని చేస్తున్న సమయంలో, తాను ఇంటర్మీడియట్ విద్యార్థిగా ఆయన దగ్గర విద్యన భ్యసించిన సందర్భాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. రమణయ్య కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రమణయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కాగా 1971 లో సిద్దిపేటలో జూనియర్, డిగ్రీ కాలేజీలో హిస్టరీ లెక్చరర్ గా డా.జైశెట్టి రమణయ్య పని చేశారు. చిన్న వయసులోనే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన వ్యక్తిగా పేరున్నది. "సౌత్ ఇండియా టెంపుల్స్" అనే పరిశోధనాత్మక గ్రంధాన్ని సమర్పించి జైశెట్టి రమణయ్య పీహెచ్ డీ పట్టా పొందారు. కరీంనగర్ జిల్లా సంస్కృతి చరిత్ర పేరుతో ఉమ్మడి జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాలు, గుడులు తదితర విషయాల గురించి పూర్తి సమాచారంతో పుస్తకం రూపొందించారు. ఈ మేరకు శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ రమణయ్య మృతదేహం వద్ద నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రమణయ్య కుమారుడు అమెరికా నుంచి బయలుదేరారని, ఆదివారం అంత్రక్రియలు నిర్వహించనున్నట్లు సన్నిహితులు తెలిపారు.

# డీపీఆర్ రెడీ చేసుకోండి

- రీజినల్ రింగు రోడ్డు దక్షిణ భాగంపై అప్డేట్
- మంత్రి కోమటిరెడ్డికి నితిన్ గడ్కరీ లేఖ
- డీపీఆర్ తయారీకి కన్సల్టెన్సీని అపాయింట్
- త్వరలోనే పూర్తిస్థాయి నివేదిక



ముద్ర, తెలంగాణ బ్యూరో :
హైదరాబాద్ చుట్టూ రాబోతున్న ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రం నుంచి తీపి కబురు అందింది. దక్షిణ భాగంపై మరో ముందడుగు పడింది.. డీపీఆర్ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి లేఖ రాశారు. దక్షిణ భాగం డీపీఆర్ తయారీకి కన్సల్టెన్సీని అపాయింట్ చేసినట్లు నితిన్ గడ్కరీ ఆ లేఖలో తెలిపారు.

**డీపీఆర్ కోసమే..?**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టుకు సంబంధించి కీలక అడుగు పడింది. ఈ రహదారి దక్షిణ భాగానికి సంబంధించిన డీపీఆర్‌పై కేంద్రం అప్డేట్ ఇచ్చింది. ఆర్ఆర్ఆర్ ప్రాజెక్ట్ దక్షిణ భాగానికి కన్సల్టెన్సీ డీపీఆర్‌ను రూపొందిస్తున్నామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి లేఖ రాశారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం డీపీఆర్ తయారీకి సంబంధించి చర్యలు చేపట్టామని.. కన్సల్టెన్సీని అపాయింట్ చేసినట్లు గడ్కరీ లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 2025 ఆగస్టు 5న ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అనుమతివ్వాలని కేంద్రానికి లేఖ రాశారు. ఈ లేఖపై స్పందిస్తూ దక్షిణ భాగానికి డీపీఆర్ తయారీలో ఉందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలంగాణ మంత్రికి లేఖ రాశారు. డీపీఆర్‌పై నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని లేఖలో తెలిపారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం డీపీఆర్‌పై నితిన్ గడ్కరీ లేఖ రాయడంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.. గడ్కరీకి ధన్యవాదాలు తెలిపారు. ఉత్తర భాగం ఇప్పటికే మంజూరై.. టెండర్ దశలో ఉందని కోమటి రెడ్డి గుర్తు చేశారు. దక్షిణ భాగం పట్ల కూడా కేంద్రం నుంచి సానుకూల నిర్ణయం రావడం శుభపరిణామం అన్నారు. తెలంగాణకు ఆర్ఆర్ఆర్ గేమ్ ఛేంజర్ కాబోతుందని మంత్రి వెంకటరెడ్డి అన్నారు.

**ఆర్ఆర్ఆర్ సపోర్ట్**

కేంద్రం సహకారంతో ఆర్ఆర్ఆర్‌ను చేపట్టారు.. ఈ ప్రాజెక్టులో ఉత్తరభాగం మొత్తం 161.5 కిలోమీటర్ల (సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి యాదాద్రి జిల్లాలోని తంగడ్‌పల్లి వరకు) మేర రెండు ప్యాకేజీల్లో నిర్మించనున్నారు. ఈ మేరకు త్వరలోనే టెండర్లను ఆహ్వానించనున్నారు. దాదాపు రూ.21వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించారు. అలాగే ఆర్ఆర్ఆర్ ప్రాజెక్ట్ దక్షిణ భాగం మొత్తం 201 కిలో మీటర్లు (తంగడ్‌పల్లి నుంచి సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ వరకు) కాగా.. తెలంగాణ ప్రభుత్వం ఉత్తరభాగంతో సమాంతరంగా దక్షిణ భాగం ఈ పనులనూ చేపట్టాలనిగతంలో డీపీఆర్‌ను చేపట్టింది. కేంద్రానికి కూడా తెలంగాణ సర్కార్ అనేక సార్లు రిక్వెస్ట్ చేసింది. ఇప్పుడు డీపీఆర్‌పై అప్డేట్ వచ్చింది.

## మంచు చరియలు విరిగిపడి ఏడుగురి మృతి

ముద్ర న్యూస్ :
లద్దాఖ్‌లో శ్రీనగర్- లేహ్ హైవేపై జోజిలా పాస్ వద్ద మంచు చరియలు విరిగిపడిన ఘటనలో ఏడుగురు మృతి చెందారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. మంచు చరియల కింద అనేక వాహనాలు చిక్కుకుపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో), పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. మంచును తొలగించడంతోపాటు ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాయి.ఈ ప్రమాదంపై లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనా



స్థలాన్ని సందర్శించి, సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతుల కుటుంబాలకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సంతాపం ప్రకటించారు. గాయపడిన వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

### మిల్లెట్ ఉప్మా.. పూరీ.. దోసె.. బొండా

# ఇదీ సర్కారు మెనూ



- ప్రభుత్వ బడిలో బ్రేక్ ఫాస్ట్
- 5 రకాల టిఫిన్లతో మెనూ..
- ఐటెమ్స్ లిస్ట్ ఫైనల్
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు
- ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు

ముద్ర, తెలంగాణ బ్యూరో :
తెలంగాణ ప్రభుత్వం వచ్చే విద్యాసంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అందించనుంది. మెనూలో ఉదయం 5 రకాల టిఫిన్లు ఉన్నాయి. రెండు రోజులు మిల్లెట్ ఇడ్లీ.. మిగిలిన రోజుల్లో మిల్లెట్ ఉప్మా, దోసె, పూరి, బోండాను మెనూలో చేర్చారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు ఇదే మెనూ అమలు చేయనుంది ప్రభుత్వం. ముఖ్యమంత్రి బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద విద్యార్థులకు 5 రకాల టిఫిన్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే విద్యా సంవత్సరం (2026-27)లో ఈ టిఫిన్లు విద్యార్థులకు అందిస్తారు. వారంలో ఆదివారం సెలవు కాబట్టి మిగిలిన ఆరు రోజులు ఉదయం టిఫిన్, పాలు/రాగిజావ అందించాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ ఆరు రోజులలో రెండు రోజుల పాటూ మిల్లెట్ ఇడ్లీ ఉంటుంది. మిగిలిన నాలుగు రోజులు మిల్లెట్ ఉప్మా, దోసె, బోండ, పూరిని మెనూలో చేర్చారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు ఇదే మెనూ అమలు చేయాలని నిర్ణయించారు.

**ఆల్టనేట్ కూడా..**

ఈ మెనూకు సంబంధించి మరో వెసులుబాటు కూడా కల్పించింది ప్రభుత్వం. సోమవారం దోసెకు బదులు చపాతీ, శుక్రవారం మిల్లెట్ ఉప్మాకు బదులు పొంగల్ ప్లాన్ చేశారు. వీటిలో ఏది వీలైతే దాన్ని అందించేలా నిర్ణయం తీసుకున్నారు. మొత్తం రూ.720 ఖర్చు అవుతందని అంచనా వేయగా.. వీటిలో పాఠశాల విద్యార్థుల టిఫిన్‌కు రూ.540 కోట్లు, పాల కోసం రూ.180 కోట్లు ఖర్చవుతుంది. ఇప్పటికే ఈ నిధుల్ని బడ్జెట్‌లో కూడా కేటాయించిన సంగతి తెలిసిందే. ఇక ఇంటర్ విద్యార్థులకు సంబంధించి రూ.56 కోట్లు కేటాయించారు. ఈ ముఖ్యమంత్రి బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద సుమారు 22 లక్షలమంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. విద్యార్థులు టిఫిన్ తినడానికి 45 నిమిషాలు కేటాయిస్తారు.

**పూర్తి లిస్టు ఇదే**

ఈ మెనూలో.. సోమవారం దోసె-చట్నీ/చపాతీ-కర్రీ.. మంగళవారం మిల్లెట్ ఇడ్లీ (రెండు)-సాంబారు.. బుధవారం పూరి (రెండు)-ఆలూ కుర్మా.. గురువారం మిల్లెట్ ఇడ్లీ (రెండు)-సాంబారు.. శుక్రవారం మిల్లెట్ ఉప్మా/పొంగల్-చట్నీ.. శనివారం బోండా (రెండు)-చట్నీ అందిస్తారు. టిఫిన్‌తో పాటుగా ఒక రోజు పాలు, ఒక రోజు రాగి జావ అందిస్తారు. వారంలో ఆదివారం సెలవు కాబట్టి.. మిగిలిన ఆరు రోజుల్లో.. మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావ అందిస్తారు. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పౌష్టికాహారం అందించే లక్ష్యంగా ఈ ముఖ్యమంత్రి బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేయనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెన్నైలో ఓ కార్యక్రమానికి హాజరయ్యారు.. అక్కడ తమిళనాడు తరహాలో తెలంగాణలో కూడా 2026 నుంచి నుంచి బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలుచేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే.

## తిరుమల శ్రీవారి ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ విధానంలో మార్పులు

### భక్తుల సమస్యను పరిష్కరించిన టీటీడీ

ముద్ర తిరుమల :
శ్రీవారి ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ విధానంలో తితిదే మార్పులు చేసింది. గతంలో భక్తులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించింది. శుక్రవారం నుంచి భక్తులు శ్రీవారి ట్రస్ట్‌కు రూ.10వేలు విరాళంతోపాటు, వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్‌కు రూ.500 కలిపి ఒకేసారి రూ.10,500 చెల్లించే అవకాశం కల్పించారు. దీనికి సంబంధించిన పేమెంట్ గేట్‌వే లావాదేవీలను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అప్పగించారు. ఇందుకోసం భక్తులు యూపీఐ, డెబిట్, క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్‌తో చెల్లింపు చేయవచ్చు. భక్తుల సౌకర్యార్థం ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్న శ్రీవారి ట్రస్ట్ టికెట్లను తితిదే కరెంట్ బుకింగ్ విధానంలో ఈ సంవత్సరం జనవరి 9 నుంచి ఆన్‌లైన్‌లో జారీ చేస్తున్నారు. కరెంట్ బుకింగ్ కోటా కింద ప్రతిరోజూ 800 టికెట్లను ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో టికెట్‌ను విడుదల చేయగా 1+3 భక్తులకు మాత్రమే టికెట్ బుకింగ్ అనుమతి ఇస్తున్నారు. ఒక ఐడీపై ఒకసారి టికెట్ పొందితే వారం పాటు టికెట్ పొందడానికి వీలుపడదు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
28.03.2026 శనివారం, హైదరాబాద్
4 వేదిక Peoples Voice
మీ 'ముద్ర' వేయండి
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# పోరాట స్ఫూర్తికి ప్రతీక ఐజేయూ

IJU
Indian Journalists Union



దేశంలో వర్కింగ్ జర్నలిస్టుల ఉద్యమానికి ప్రతీకగా నిలిచిన ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) 2026 మార్చి 28 29 తేదీలలో విజయవాడలో 11వ ప్లీనరీ నిర్వహించుకుంటున్నది. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం, దేశంలో మీడియా ప్రమాణాల పెంపుదలే లక్ష్యంగా మూడున్నర దశాబ్దాలుగా పనిచేస్తున్న సంఘం ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్. 25 రాష్ట్రాలలో అనుబంధ సంఘాలతో 30 వేలకు పైగా సభ్యత్వంతో దేశంలోనే అతిపెద్ద జర్నలిస్టు సంఘంగా ఐజేయూ నిలిచింది. నిబద్ధత, అంకితభావం కలిగిన పటిష్టమైన నాయకత్వంతో గత 35 సంవత్సరాలుగా పాత్రికేయుల సంక్షేమానికి అంకితమైన ఏకైక జర్నలిస్టుల ఉద్యమ సంస్థగా కొనసాగుతున్నది. భారత పాత్రికేయ దిగ్గజం మానికొండ చలపతిరావు వ్యవస్థాపక అధ్యక్షులుగా 1950 లో ఏర్పాటైన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐ ఎఫ్ డబ్ల్యూ జె ) ఆ తర్వాత కాలంలో కొందరు స్వార్థపూరిత వ్యక్తుల నియంతృత్వ పోకడలతో, అవినీతి కార్యకలాపాలతో నిర్వీర్యమైనప్పుడు ఏపీయూడబ్ల్యూజేతో సహా ఐదు రాష్ట్రాల యూనియన్లు తిరుగుబాటు చేసి 1989 లో ఐజేయూను స్థాపించాయి. 1990లో నాటి ఉమ్మడి బీహార్ రాష్ట్రంలోని పారిశ్రామిక కేంద్రమైన రాంచీ (ప్రస్తుత ఝార్ఖండ్ రాజధాని) లో వ్యవస్థాపక మహాసభను ఏర్పాటు చేసుకున్నారు. పార్టీ నియమావళిని ఆ సమావేశంలోనే ఆమోదించుకున్నారు. ఆ తర్వాత ఐజేయూ దేశంలోని జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతూ వారి మన్ననలు పొందుతూ పటిష్టమవుతూ వచ్చింది. మొదటి ప్లీనరీలో దివంగత సంతోష్ కుమార్ అధ్యక్షుడుగా, కళ్యాణ చౌదరి సెక్రటరీ జనరల్ గా ఎన్నికయ్యారు. రెండవ ప్లీనరీ 1992లో విజయవాడలో జరిగింది. మళ్లీ ఇప్పుడు విజయవాడలో అదే ప్రాంగణం (తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం ) లో 11వ ప్లీనరీ జరుగుతోంది.

గత 35 ఏళ్ల కాలంగా దేశంలోని వర్కింగ్ జర్నలిస్టుల ప్రయోజనాలను కాపాడటానికి ఐజేయు కృషి చేస్తూ వచ్చింది. అన్ని రాష్ట్రాల్లోని తన అనుబంధ సంఘాల పటిష్టానికి కృషి చేస్తూ, వర్కింగ్ జర్నలిస్టుల ఉద్యమ బాటలో బలమైన శక్తిగా ముందుకు సాగడానికి వాటిని ప్రోత్సహిస్తూ వచ్చింది. దీర్ఘకాలం సెక్రెటరీ జనరల్ గా, అధ్యక్షులుగా పనిచేసిన కే శ్రీనివాస్ రెడ్డి, ఆ తర్వాత ఎస్ ఎన్ సిన్హా, దేవులపల్లి అమర్, బల్విందర్ సింగ్ జమ్మూ యూనియన్ కు పటిష్టమైన నాయకత్వాన్ని అందించి ఐజేయూను దేశంలోనే బలమైన జర్నలిస్టు ఉద్యమ సంస్థగా రూపొందించారు. గత మూడు దశాబ్దాలుగా వేజ్ బోర్డుల ముందు వర్కింగ్ జర్నలిస్టులు, నాన్ జర్నలిస్టు సిబ్బంది ప్రయోజనాలను కాపాడటానికి బలమైన వాదనలను వినిపిస్తూ వారికి మెరుగైన వేతనాలు అందించడంలో యూనియన్ శాయశక్తులా కృషి చేసింది. జర్నలిస్టుల మీద మీడియా సంస్థల మీద సంఘ వ్యతిరేక శక్తులు, వివిధ రకాల మాఫియా ముఠాలు, స్వార్థ రాజకీయ నేతలు దాడులకు పాల్పడినప్పుడు, పోలీసులు జులుం చేయడానికి ప్రయత్నించినప్పుడు ఐజేయూ దాని అనుబంధ సంఘాలు రంగంలోకి దిగి జర్నలిస్టులకు న్యాయం చేకూర్చడానికి పోరాడుతూ వస్తున్నాయి. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేసే ఖర్చు విషయంలో ఎన్నికల సంఘం నిబంధనల నుండి తప్పించుకోవడానికి మీడియా సంస్థల యాజమాన్యాలతో కుమ్మక్కై ప్రకటనలకు బదులు ఆహా ఓహో అంటూ అయినవారికి అనుకూలంగా వార్తలు రాసే దుష్ట చర్యకు తెరతీశాయి. డబ్బులు తీసుకుని రాసే అలాంటి వార్తలను పసిగట్టి వాటి ద్వారా మీడియా యాజమాన్యాలు కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్న విషయాన్ని ఐజేయూ దాని అనుబంధ సంఘమైన ఏపీయూడబ్ల్యూజే బహిర్గతం చేసింది. ఈ కొత్త జాడ్యానికి పెయిడ్ న్యూస్ అని నామకరణం చేసింది ఐజేయూనే. ఇందుకుగాను దేశంలోని ప్రజాస్వామిక వాదుల నుంచి ప్రశంసలు పొందింది.

2009 10 సంవత్సరాలలో ఐ జేయూ మరో సంక్షోభాన్ని కూడా ఎదుర్కొంది. జీవితకాలం అధ్యక్షుడుగా కొనసాగాలనుకున్న మరో వ్యక్తి వల్ల వచ్చిన సమస్యను కూడా ఐజేయూ ఐక్యంగా అధిగమించింది. తన పదవీ లాలసకు అడ్డుపడిన నేతలను, ప్రధాన యూనియన్లను సైతం యూనియన్ కు దూరం చేయడానికి ప్రయత్నించిన ఆ వ్యక్తిని ఐజేయూ సమర్థవంతంగా ఎదుర్కొని అతన్ని, అతని అనుచరులను బయటకు సాగనంపింది. 201920 లో కూడా ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ మరో అంతర్గత సమస్యను చాకచక్యంగా అధిగమించింది. ఉన్నత పదవిలో ఉన్న ఒక వ్యక్తి యూనియన్ నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తూ ఇష్టా రీతిన నిర్ణయాలు తీసుకున్నప్పుడు ఆ వ్యక్తిని యూనియన్ నుంచి బహిష్కరించింది. ఈ కార్యకలాపాలకు సహకరించిన వారికి కూడా అదే గతి పట్టింది. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ( పీసీఐ), సెంట్రల్ ప్రెస్ అక్రిడేషన్ కమిటీ (సీపీఏసీ) లలో జాతీయ జర్నలిస్ట్ యూనియన్లకు ప్రాతినిధ్యాన్ని నిరాకరించేందుకు కేంద్ర ప్రభుత్వం వాటి నిబంధనలను మార్చింది. ఈ విషయంపై ఐజేయూ న్యాయపోరాటం కొనసాగిస్తున్నది.

### లేబర్ కోడ్ లపై పోరాటం

కార్మిక చట్టాల కోడిఫికేషన్ పేరిట మొత్తం దేశంలోని కార్మిక వర్గ హక్కులు, సంక్షేమం, ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్న కేంద్ర ప్రభుత్వం చర్యలను ఐజేయూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ప్రెస్ కమిషన్ సిఫార్సుల ఫలితంగా 1955లో పార్లమెంటు చట్టం ద్వారా వచ్చిన వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్ ను, జర్నలిస్టులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేజ్ బోర్డు వ్యవస్థను కోడిఫికేషన్ లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. వాటి పునరుద్ధరణ కోసం ఐజేయూ అనేక పోరాటాలు చేపట్టింది. లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్లు చేసిన పోరాటాలకు, సమ్మెలకు ఐజేయూ సంఘీభావం తెలిపి వాటిలో పాల్గొన్నది.

### కాన్ఫెడరేషన్ లో క్రియాశీలక పాత్ర

జర్నలిస్టుల హక్కుల సాధన, సంక్షేమం, దేశంలో మీడియా ప్రమాణాల పెంపుదల కోసం జాతీయస్థాయిలో ఐక్య పోరాటాలు చేపట్టేందుకు ఏర్పాటు చేసుకున్న కాన్ఫెడరేషన్ ఆఫ్ న్యూస్ పేపర్ అండ్ న్యూస్ ఏజెన్సీ ఎంప్లాయిస్ యూనియన్స్ లో ఐజేయూ కీలక పాత్ర పోషిస్తున్నది. అయితే గత కొంతకాలంగా నిస్తేజంగా ఉన్న కాన్ఫెడరేషన్ ను పున రుత్తేజపరిచి పోరాట పంథాలో నడిపేందుకు దాని నాయకత్వ బాధ్యతలు చేపట్టేందుకు ఐజేయూ సిద్ధంగా ఉన్నది. ఇటీవల చండీగఢ్ లో జరిగిన కాన్ఫెడరేషన్ సమావేశంలో ఐ జేయూ అధ్యక్షుడు కే శ్రీనివాస్ రెడ్డి ఈ మేరకు సుముఖత వ్యక్తం చేశారు. కాన్ఫెడరేషన్ తదుపరి సమావేశాన్ని హైదరాబాద్ లో నిర్వహించడానికి సూచనప్రాయంగా ఆయన అంగీకారం కూడా తెలిపారు.

### మీడియా కమిషన్ ఏర్పాటుకు డిమాండ్

దేశంలోని మీడియా రంగంలో పెను మార్పులు వచ్చిన నేపథ్యంలో తాజాగా పరిస్థితిని అధ్యయనం చేయడానికి మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని ఐజేయూ చాలా కాలంగా డిమాండ్ చేస్తూ వస్తున్నది. ఎలక్ట్రానిక్ మీడియాను, వెబ్, డిజిటల్ మీడియాలను చట్ట పరిధిలోకి తీసుకురావాలని కూడా సూచిస్తూ వస్తున్నది. అలాగే ప్రస్తుతం కేవలం ప్రింట్ మీడియాకే పరిమితమైన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను మీడియా కౌన్సిల్ ఆఫ్ ఇండియా గా మార్చాలని కూడా డిమాండ్ చేస్తున్నది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రులకు ఎన్నిసార్లు ఏకరువు పెట్టుకున్నా, మెమొరాండాలు సమర్పించినా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదు. ఈ విషయంలో మరింత గట్టి పోరాటానికి ఐజేయూ సమాయత్తమవుతున్నది.

### రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్

దేశంలో ప్రస్తుతం 13 రాష్ట్రాలలో ప్రభుత్వాలు రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తున్నాయి. ఈ పెన్షన్ కు సంబంధించి ఆయా ప్రభుత్వాలు నిర్దేశించిన అర్హతలు, పెన్షన్ మొత్తాలు భిన్నంగా ఉన్నాయి. అందువల్ల దేశమంతటా ఏకరూప పెన్షన్ ఇవ్వాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ గత కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. అలాగే కరోనా కాలంలో ఉపసంహరించిన జర్నలిస్టుల రైల్వే రాయితీ ప్రయాణ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కూడా ఐజేయూ కోరుతున్నది. గత మూడు సంవత్సరాలలో దీనికి సంబంధించి పలువురు కేంద్ర మంత్రులకు, ఎంపీలకు, ఉన్నతాధికారులకు విజ్ఞప్తులు చేసినా ఎలాంటి ప్రయోజనం కలుగలేదు. దీని మీద కూడా ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెచ్చే ప్రయత్నం ఐజేయూ చేస్తున్నది.

11వ ప్లీనరీలో అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టనున్న బల్విందర్ సింగ్ జమ్మూ, సెక్రటరీ జనరల్ గా బాధ్యతలు స్వీకరించనున్న డి సోమ సుందర్ నాయకత్వంలో యూనియన్ రానున్న కాలంలో జర్నలిస్టుల సమస్యలపై గట్టి పోరాటాలకు సిద్ధం కానున్నది. ప్లీనరీలో ఖరారు చేయనున్న కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగనున్నది.

### ప్రత్యేక భద్రతా చట్టం

తమకు నచ్చని వార్తలు, కథనాలు రాసే జర్నలిస్టుల మీద, మీడియా సంస్థల మీద సంఘ వ్యతిరేక శక్తులు, వివిధ రకాల మాఫియా ముఠాలు, రాజకీయ నాయకులు, అధికారులు, పోలీసులు దాడులకు పాల్పడటం సర్వసాధారణమైపోయింది. ఇటువంటి దాడులకు పాల్పడే వారి మీద విచారణ జరిపి చర్యలు తీసుకోవడం అరకొరగా మాత్రమే జరుగుతున్నది. ప్రభుత్వ ఉద్యోగుల మీద దాడులకు పాల్పడే వారి పైన ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో మీడియా మీద దాడులు జరిగిన సందర్భాలలో కూడా ఆ విధంగానే చర్యలు తీసుకోవాలని ఐజేయూ చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. జర్నలిస్టుల మీద మీడియా సంస్థల పైన దాడికి పాల్పడే వారి మీద చర్యలు తీసుకోవడానికి ఒక ప్రత్యేక చట్టం తేవాలని ఐజేయూ చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నది. మహారాష్ట్ర, ఛత్తీస్ గడ్ లాంటి రాష్ట్రాలలో ఇటువంటి చట్టాలు తెచ్చారు. కానీ అవి చాలా బలహీనంగా ఉన్నాయి. అయితే జాతీయ స్థాయిలో ఒక పటిష్టమైన చట్టం తేవాలనే డిమాండ్ మీద ఐజేయూ పట్టుబట్టనున్నది.

**(విజయవాడలో జరుగనున్న ఐజేయూ 11వ ప్లీనరీ సందర్భంగా)**
**వై నరేందర్ రెడ్డి,**
**సీనియర్ జర్నలిస్ట్**
**కార్యదర్శి, ఐజేయూ**




# చరిత్ర పుటల్లో తెలుగు పాత్రికేయ వైభవం


## ఐజేయూ ప్లీనరీ సందర్భంగా ప్రత్యేక కథనం

**ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (IJU) 11వ ప్లీనరీ విజయవాడలో జరుగుతున్న ఈ సందర్భం తెలుగు పాత్రికేయ చరిత్రలో ఒక ప్రత్యేక ఘట్టం. ఈ వేళ సాటి తెలుగు పాత్రికేయుడు, ఉద్యమ నాయకుడు డి. సోమసుందర్ సెక్రటరీ జనరల్ బాధ్యతలు స్వీకరించడం ప్రతి తెలుగు జర్నలిస్టుకు గర్వకారణం. ఈ సందర్భంలో పాత్రికేయ ఉద్యమానికి పునాది వేసిన తెలుగు మహనీయులను స్మరించుకోవడం సముచితం.**



పాత్రికేయ ఉద్యమ పితామహులు మానికొండ చలపతి రావు గారు (ఎంసి).



ఐజెయు ప్రస్తుత జాతీయ అధ్యక్షులు, పూర్వ సెక్రటరీ జనరల్ కె.శ్రీనివాస రెడ్డి గారు


ఐజెయు పూర్వ జాతీయ అధ్యక్షులు, సెక్రటరీ జనరల్ దేవులపల్లి అమర్ గారు




స్వాతంత్ర్యం రాకముందే తెలుగునాట పాత్రికేయ ఉద్యమం మొలకెత్తింది. 1935లో బెజవాడలో కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు అధ్యక్షతన ఆంధ్ర రాష్ట్ర పత్రికా రచయితల తొలి సమావేశం జరగడం ఒక చారిత్రక మైలురాయి. తరువాత గుంటూరు, ఏలూరు, రాజమండ్రి, చెన్నపురి వంటి ప్రాంతాల్లో వరుసగా మహాసభలు జరిగి ఉద్యమానికి రూపురేఖలు ఏర్పడ్డాయి. తాపీ ధర్మారావు, పోతన్ జోసఫ్, కోటమరాజు రామారావు వంటి ప్రముఖులు ఈ ఉద్యమానికి దిశానిర్దేశం చేశారు. ఇదే సమయంలో నిజాం పాలనలో 1941లో హైదరాబాద్ రాష్ట్ర పత్రికా రచయితల సంఘం ఏర్పడటం మరో కీలక ఘట్టం. మందుముల నర్సింగరావు అధ్యక్షతన ఏర్పడిన ఈ సంఘం రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఎదురైన కాగితం కొరత, సెన్సార్ వంటి సమస్యల మధ్య జర్నలిస్టులను సంఘటితంగా నిలబెట్టింది. ఆ తర్వాత ఖాజీ అబ్దుల్ గఫార్ వంటి నాయకులు ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. 1949లో విజయవాడలో జరిగిన సమావేశం రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల ఐక్యతను బలపరిచింది. 1950 దశకంలో జిల్లాల స్థాయిలో పత్రికా రచయితల సంఘాలు, ప్రెస్ క్లబ్బులు స్థాపించబడడం ఉద్యమానికి బలమైన పునాది వేసింది. 1956లో ట్రేడ్ యూనియన్ అవసరాన్ని గుర్తించి తీసుకున్న నిర్ణయాలు ఉద్యమాన్ని కొత్త దిశగా మలిచాయి. ఈ పరిణామాల ఫలితంగా 1957 ఆగస్టు 17న హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (APUWJ) ఆవిర్భవించింది. మానికొండ చలపతిరావు నాయకత్వంలో ఏర్పడిన ఈ సంఘం పాత్రికేయ కార్మిక ఉద్యమానికి బలమైన వేదికగా నిలిచింది. తొలి అధ్యక్షుడిగా ఎం. చంద్రశేఖరం, ప్రధాన కార్యదర్శిగా జి. రామారావు బాధ్యతలు స్వీకరించారు. కాలక్రమేణా APUWJ అనేక సవాళ్లను ఎదుర్కొంటూ పాత్రికేయ హక్కుల కోసం పోరాడిన ప్రధాన శక్తిగా ఎదిగింది. రాష్ట్ర విభజన సమయంలో కూడా ఐక్యతను కాపాడుతూ, తరువాత రెండు రాష్ట్రాల్లో వేర్వేరు సంఘాలుగా ఏర్పడినా ఐజెయు ఆధ్వర్యంలో కలసికట్టుగా కొనసాగడం ఈ ఉద్యమ ప్రత్యేకత. జాతీయ స్థాయిలో కూడా తెలుగు జర్నలిస్టులు విశిష్ట పాత్ర పోషించారు. కోటమరాజు రామారావు ఐఎఫ్‌డబ్ల్యూజె రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించగా, కె. శ్రీనివాసరెడ్డి, దేవులపల్లి అమర్ వంటి నాయకులు ఐజెయు లో ప్రముఖ పదవుల్లో సేవలందించారు. 1990 డిసెంబరులో రాంచీలో ఐజెయు ఆవిర్భవించి దేశవ్యాప్తంగా జర్నలిస్టుల ఐక్యతకు వేదికైంది. ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ప్రస్తుతం విజయవాడలో జరుగుతున్న 11వ ప్లీనరీలో డి. సోమసుందర్ సెక్రటరీ జనరల్‌గా బాధ్యతలు చేపట్టడం తెలుగు పాత్రికేయుల ప్రతిష్టను మరింత పెంచింది. బల్వీందర్ సింగ్ జమ్ము జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఈ సందర్భానికి మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది. తెలుగు పాత్రికేయుల చరిత్ర అంటే పోరాటం, ప్రగతి, ప్రామాణికతల సమ్మేళనం. ఆ స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలవడం మన అందరి బాధ్యత.


ఐజెయు నూతన జాతీయ అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్ము గారు


ఐజెయు నూతన సెక్రటరీ – జనరల్ డి. సోమసుందర్ గారు

**లాంగ్ లివ్ జర్నలిస్ట్స్ యూనిటీ..**
**లాంగ్ లివ్ IJU..!**
**— బీఎస్ రామకృష్ణ**
**సీనియర్ జర్నలిస్ట్**
**పాత్రికేయ ఉద్యమ కార్యకర్త**





సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 28.03.2026
www.mudranews.in | @mudranews



**పెట్రోల్, డీజిల్ ఆదా కోసం..**



టైర్లలో సరైన గాలి ఒత్తిడి ఉంచండి టైర్ ప్రెషర్ తక్కువగా ఉంటే ఇంధన వినియోగం పెరుగుతుంది. రెగ్యులర్‌గా చెక్ చేయడం అవసరం.

# అంగరంగ వైభవంగా రాములోరి కళ్యాణం

**శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఊరూర కనుల పండువగా, వైభవంగా నిర్వహించారు. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యల శిరస్సుపై ఆలయ అర్చకులు జీలకర్ర, బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్య ధారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.**



నాగర్ కర్నూల్‌లో..




సిర్పనగండ్లలో..



తాండూర్‌లో..



మల్కాజ్ గిరిలో..



గద్వాలలో..



నేరేడ్మెట్‌లో..

### తాండూర్‌లో..

**ముద్ర, తాండూర్ :** తాండూర్ పట్టణంలోని ఇందిరానగర్ లో పాత తాండూర్ లోని శ్రీ వెంకటేశ్వర శ్రీ రామలింగేశ్వరా దేవాలయం లో నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం లో తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొన్నారు కార్యక్రమాల్లో రాష్ట్ర టీపీసీసీ ప్రచార కోఆర్డినేటర్ కరణం పురుషోత్తం రావు,యువ నాయకులు బిర్కెట్ రఘు, భగవాన్, నారా శ్రీకాంత్, మిర్చి వెంకట్, అగ్గనుర్ సంకేత్, సిద్ధూ అయ్యా పాల్గొన్నారు.

### నాగర్ కర్నూల్‌లో..

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** పట్టణంలోని శ్రీ రామస్వామి దేవాలయంలో నిర్వహించిన కల్యాణానికి ఎమ్మెల్యే దంపతులు డాక్టర్ కూచుకుళ్ల సరితా రాజేష్ రెడ్డి హాజరయ్యారు. స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో సేవలందించారు. అలాగే ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి కూడా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్ర మంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని, సంఘ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవంలో చిన్నారులు సీత, రామ, లక్ష్మణ, హను మాన్ వేషధారణలో ఆకట్టుకున్నారు. గోవింద క్షేత్రం శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సాయంకాలం సీతారాముల కళ్యాణ మహోత్సవం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ ఆచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

### మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

శ్రీ రామస్వామి దేవాలయంలో సీతారాముల కళ్యాణోత్సవం సందర్భంగా కిరాణా వర్తక సంఘం ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు సంబు పాండు, క్యాషియర్ వాస శ్రీనివాసులు, కార్యదర్శి కందికొండ సాయికృష్ణ, అల్లంపల్లి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ కొత్త నరేష్ బాబు, శ్రీకాంత్ తదితర కిరాణా సభ్యులు పాల్గొన్నారు.

### జుంటుపల్లిలో..

వికారాబాద్ జిల్లా యలాల్ మండలంలోని ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం జుంటుపల్లి రామస్వామి ఆలయంలో జరిగిన సీతారాముల కళ్యాణోత్సవంలో తాండూర్ శాసనసభ్యులు మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం పట్టణంలోని అనేక ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలలో ఇందిరా నగర్ లోని రామ్ మందిర్, పాత తాండూర్, సీతారాంపేట్, సీసీఐ కాలనీ, సాయి పూర్, మల్రెడ్డిపల్లి దేవాలయాల్లో కళ్యాణోత్సవాల్లో పాల్గొన్నారు.

### గద్వాలలో..

**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:** గద్వాల పట్టణం నది అగ్రహారం రోడ్డులో గల స్వయంభూ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో కల్యాణం కనుల పండువగా జరిగింది. కళ్యాణ వేడుకల మహోత్సవ సందర్భంగా రాములవారి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గద్వాల సీఐ టంగుటూరి శ్రీను దంపతులు, పట్టణఎస్ఐ 2 సతీష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### మల్కాజిగిరి,కాప్రాలో..

**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజిగిరి, కాప్రా, నాచారం, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో సీతారాముల కళ్యాణం భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా శుక్రవారం నిర్వహించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి కాప్రా, నాచారం, హబ్సిగూడ, ఉప్పల్ ప్రాంతాలలో కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేరేడ్మె ట్ శ్రీ వరసిద్ధి వినాయక సాయిబాబా ఆలయంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హాజరై ఆలయ ముఖ మండపాన్ని ప్రారంభించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి, వేలాది మంది భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

## అలరించిన బుడతలు



**నాగర్ కర్నూల్, వికారాబాద్ జిల్లా కేరెళ్లిలో నిర్వహించిన సీతారామ కళ్యాణ ఉత్సవాల్లో చిన్నారులు సీతా, రామ, లక్ష్మణ, హనుమాన్ వేషధారణలో ఆకట్టుకున్నారు.**



**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

ధారూర్ మండలం కేరెళ్లి గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భజన మండలి సభ్యులు భక్తి గీతాలు ఆలపిస్తూ కార్యక్రమానికి ఆధ్యాత్మిక వాతావరణాన్ని తీసుకువచ్చారు. వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్, బిజెపి నాయకులు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, సదానంద్ రెడ్డి, ధారూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పద్మమ్మ రాములు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు భక్తులు పాల్గొని ఉత్సాహంగా వేడుకలను నిర్వహించారు.



## ఎండోస్కోపి సెంటర్ ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్స్ వివేక్ గ్యాస్ట్రో, లివర్ & ఎండోస్కోపి సెంటర్ హాస్పిటల్‌ను ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని, ఇలాంటి ఆధునిక వైద్య కేంద్రాలు జిల్లాలో ఏర్పడటం ఆనందకరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కల్యాణం.. కమనీయం



**ముద్ర, కూకట్‌పల్లి:** నియోజకవర్గ వ్యాప్తంగా శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా, కనులపండువగా జరిగాయి. ఆలయాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ సభ్యులు, టెంపుల్ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, మైనారిటీ, ఎస్సీ, బీసీ సెల్ నాయకులు, సేవాదళ్ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు,తతత

# శ్రీరాముని జీవితం ఆదర్శం

**ర్యాలీని ప్రారంభించిన ఎస్పీ వినీత్ కుమార్**



**ముద్ర, నారాయణ పేట :** శ్రీరాముని జీవితం అందరికీ ఆదర్శమని సమాజంలో మంచిని స్వీకరించి చెడును వదిలివేయాలని ఎస్పీ వినీత్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీరామనవమి పర్వదిన ర్యాలీని ఎస్పీ ప్రారంభించారు. ముందుగా పళ్ళ హనుమాన్ మందిరంలో ఎస్పీ ప్రత్యేక పూజలు చేశారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, బిజెపి జిల్లా అధ్యక్షులు సత్యా యాదవ్, ఏ ఎం సి చైర్మన్ సదాశివరెడ్డి, జి. రాఘవేందర్ రెడ్డి, డాక్టర్ మదన్మోహన్ రెడ్డి, మురళి భట్టడ్, రఘురామయ్య గౌడ్, ప్రవీణ్, శ్రవణ్, వెంకటేష్ గౌడ్, శ్రీకాంత్, రవికుమార్ గౌడ్, కౌన్సిలర్లు రాజుగట్, కమలాపూర్ ప్రభాకర్, మిర్చి వెంకటయ్య, చిన్న రఘు, కృష్ణ, డాక్టర్ బాలరాజ్, కోట్ల మధు, అనిల్, ఎలక్ట్రిషన్ సందీప్, తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని మూల హనుమాన్ మందిరంలో వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం జరిగింది. అలాగే అప్పిరెడ్డి పల్లి గ్రామంలో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరుకాగా మాజీ ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్ రెడ్డి ఎస్పీ దంపతులను ఘనంగా సన్మానించారు.

# ఘనంగా రామ్ చరణ్ జన్మదిన వేడుకలు

**రక్తదాన శిబిరం నిర్వహించిన అభిమానులు**

**ముద్ర, కూకట్‌పల్లి :** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 41వ పుట్టినరోజును పురస్కరించుకుని, మెగా అభిమానుల ఆధ్వర్యంలో బాలానగర్ లోని మైత్రీ విమల్ థియేటర్ వద్ద భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ జనరల్ సెక్రటరీ , సైబరాబాద్ మున్సిపల్ కో-ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకరు చేసే రక్తదానం ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందని పేర్కొన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు, రోడ్డు ప్రమాద బాధితులకు మరియు శస్త్రచికిత్సల సమయంలో రక్తం ఎంతో అవసరమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభి




నందనీయమ్ అని కొనియాడారు. ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ సామాజిక స్పృహతో ముందుకు వస్తున్న యువతను, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, మెగా అభిమానులు పెద్ద సంఖ్యలో మెగా అభిమానులు పాల్గొన్నారు

## రైతులకు స్ప్రింక్లర్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగర్ కర్నూల్ మండలానికి చెందిన రైతులకు స్ప్రింక్లర్ పైపులను ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన రైతులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారా నీటి సంరక్షణతో పాటు పంట దిగుబడులను పెంచుకోవాలని సూచించారు.

## రైతులకు వ్యవసాయ ఉపకరణాల పంపిణీ




**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** తాడూర్ మండలంలోని మేడిపూర్ గ్రామంలో రైతుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి వ్యవసాయానికి అవసరమైన పలు ఉపకరణాలను పంపిణీ చేశారు. కూరగాయల పెంపకానికి ఉపయోగపడే ప్లాస్టిక్ ట్రేలు, సేంద్రియ ఎరువుల తయారీకి వర్మీ కంపోస్ట్ బెడ్లు, అదనపు ఆదాయ వనరుగా తేనెటీగల పెంపకానికి బాక్సులను రైతులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి ఉత్పత్తిని పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామచంద్ర రెడ్డి, తాడూర్ సర్పంచ్ మల్లయ్య, మేడిపూర్ సర్పంచ్ మల్లయ్య, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మర్రి జన్మదిన ఏర్పాట్లపై ఉద్రిక్తత

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

జిల్లాలో మర్రి జనార్ధన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన అలంకరణల తొలగింపుపై ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డెకరేషన్లను తొలగించేం దుకు మున్సిపల్ అధికారులు, పోలీసులు చర్యలు చేపట్టారు. బస్టాండ్ సమీపంలోని రామాలయం కమాన్ వద్ద ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్ స్ట్రీట్ లైట్స్‌పై ఏర్పాటు చేసిన కోల్డ్ ఫైర్ వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పోలీసులు, విద్యుత్ అధికారులు పేర్కొంటూ వాటిని తొలగించేందుకు ప్రయత్నించారు. అయితే, ఈ చర్యలను బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్న వారు అలంకరణలు తొలగించకుండా అడ్డుకోవడంతో అధికారులు, పార్టీ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారే అవకాశముండడంతో పోలీసులు అప్రమత్తమై పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

పెట్రోల్, డీజిల్ ఆదా కోసం వాహనాన్ని సర్వీస్ చేయండి



సరిగ్గా సర్వీస్ చేయని వాహనం ఎక్కువ ఇంధనం తాగుతుంది. ఇంజిన్ కండిషన్ బాగుంటే మైలేజ్ మెరుగ్గా ఉంటుంది.


# శ్రీరాముని జీవితం ఆదర్శం

**- సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, ధర్మపురి:**

శ్రీరాముని జీవితం ప్రజలందరికీ ఆదర్శమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శ్రీరామ నవమి సందర్భంగా గురువారం ధర్మపురి నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ధర్మపురి మండలం దొంతాపూర్ శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణ వేడుకల్లో మంత్రి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ధర్మపురి మండలం తీగల ధర్మారం శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణం వేడుకల్లో పాల్గొన్నారు. ధర్మపురి పట్టణంలోని శ్రీలక్ష్మి నరసింహా కాలనీ నిర్వహించిన సీతారామ కల్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు, నియోజకవర్గంలోని ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు.

# శ్రీరాముడి ఆశీస్సులు అందరిపై ఉండాలి

**ముద్ర, కరీంనగర్:**



శ్రీరాముడి ఆశీస్సులు అందరిపై ఉండాలని నగరంలోని 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ ఆకాంక్షించారు. శుక్రవారం డివిజన్ లోని ఆదర్శ్ నగర్ లో గల శ్రీ రాజరాజేశ్వర స్వామి అభయ ఆంజనేయస్వామి దేవస్థానంలో శ్రీరామ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ముందు స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ శ్రీదేవి దంపతులు తమ ఇంటి నుంచి శ్రీరాముల వారి ఎదుర్కోలును ఘనంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ శ్రీరాముడు మనందరి జీవితాల్లో సుఖశాంతులు, ఆనందం, ఆయురారోగ్యాలు నింపాలని కోరారు. మన డివిజన్ మరింత అభివృద్ధి చెందా లని కోరారు. ఈ కార్యక్రమంలో దేవా లయ కమిటీ అధ్యక్షులు మెతుకు కనకయ్య, కార్యదర్శులు భూంరెడ్డి, ఓ మల్లయ్య, గంధం లక్ష్మీనారాయణ, పిట్టల కనకయ్య, జిల్లి సత్తయ్య, అశోక్ రెడ్డి , ఇట్టినేని శ్రీని వాస్, తోట సత్యనారాయణ, జైపాల్ రెడ్డి, వంశీధర్ రెడ్డి, రమణారావు, రామ్మూర్తి, శ్రీనివాస్ రావు, కోటేశ్వర్, వైద్యుల శ్రీధర్, రమేష్, గంధం శ్రీధర్, భక్తులు పాల్గొన్నారు.

# కల్యాణం.. కమనీయం..

**- ఇల్లందకుంటలో ఘనంగా సీతారామ కల్యాణం**

**- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం , హుజురాబాద్ ఎమ్మెల్యే దంపతులు**

**ముద్ర, కరీంనగర్:**





అశేష భక్తజనం.. వేదమంత్రాలు, తాళాలు తప్పట్ల మధ్య కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, పూలమాలలు సమర్పించారు. కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పూలమాలలు సమర్పించారు. వారంతా స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అర్చకులు అంగరంగ వైభవంగా స్వామి వారి కల్యాణం నిర్వహించారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మికత వాతావరణం నెలకొంది. మంత్రి పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దంపతులు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తదితరులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశాలతో జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. కల్యాణం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రముఖులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం షామియానాలు, చలువ పందిళ్లు, బారికేడ్లు, కార్పెట్లు ఏర్పాటు చేశారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, తాగునీటి వసతి కల్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఉచిత మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. సీపీ గౌస్ ఆలం ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. వివిధ మార్గాల ద్వారా కల్యా ణానికి హాజరయ్యే భక్తుల కోసం పలు ప్రాంతాల్లో వాహ నాల పార్కింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, హుజురాబాద్ ఆర్డీఓ రమేష్ బాబు, ఏసీపీ మాధవి, ఈవో సుధాకర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా రాములోరి కల్యాణం

**- పట్టు వస్త్రాలు సమర్పించిన మున్సిపల్ చైర్ పర్సన్ వాణి**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవాలను కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని కోదండ రామాలయం, మార్కండేయ స్వామి ఆలయం, హనుమాన్ వాడలోని హనుమాన్ గుడి, విద్యానగర్ లోని రామాలయం తో పాటు మరికొన్ని ఆలయాల్లో రాములోరి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవంలో జగిత్యాల మున్సిపాలిటీ పాలక వర్గం తరపున మున్సిపల్ చైర్పర్సన్ శ్రీమతి సమీండ్ల వాణి శ్రీనివాస్ తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్బన్ మండలంలోని గోపాలరావుపేట ఆంజనేయ స్వామి ఆలయంలో జెడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ దంపతులు సీతారాముల కల్యాణం ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, ఆలయ కార్యవర్గం, అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లా వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే శ్రీ రామాలయాలకు భక్తులు దర్శనానికి తరలి వచ్చారు. పట్టణంలోని శాంతి నగర్, బాగుల వాడ, వాల్మీకి నగర్, రామ్ మందిరం వీధుల్లో శ్రీ రామ కల్యాణం వేడుకలు నిర్వహించారు. ఆయా దేవాలయాల వద్ద శ్రీ రామ కల్యాణం అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. పర్వదినాన్ని పురస్కరించుకుని దేవరకోట నుంచి భజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ ల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. పుర వీధుల గుండా ఈ ర్యాలీ సాగింది. శోభాయాత్రలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి, నూకల విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## నిందితులను అరెస్టు చేయాలి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లా కేంద్రంలో సీనియర్ వైద్యులు డాక్టర్ చిటికేశి సంతోష్ రాజ్ పై దాడి చేసిన నిందితులను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని బీజేఎల్పీ నేత, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. దాడికి గురైన డాక్టర్ ను ఎమ్మెల్యే శుక్రవారం పరామర్శించారు. దాడికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగి కుటుంబ సభ్యులు వైద్యునిపై దాడి చేసి 24 గంటలు గడుస్తున్నా నిందితులను పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. న్యాయం చేయాలని వైద్యులందరూ రోడ్డెక్కితే పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ఇలాంటి దాడులు పునరావృత్తం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# ప్రాణాలు పోసే డాక్టర్లకు భద్రత కరువు

**- డాక్టర్లపై దాడులు ..రోగులకు సంకటం**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**



నారాయణునికి ప్రతిరూపంగా భావించే వైద్యులకు రక్షణ కరువవుతోంది. ప్రాణాలు పోసే వైద్యులకు భద్రత కరువవుతోంది. తాజాగా గురువారం రాత్రి నిర్మల్ పట్టణంలోని పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సంతోష్ రాజ్ పై జరిగిన దాడి ఈ విషయాన్ని బలపరుస్తోంది. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు వైద్యులు సిద్ధమవుతున్నారు. వివరాల్లోకి వెళ్లితే డాక్టర్ సంతోష్ రాజ్ నెల రోజుల క్రితం ఓ బాలుడికి చికిత్స చేశారు. గురువారం ఆ బాలుడి బంధువులు ఆస్పత్రికి వచ్చి ముఖ్యమంత్రి సహాయ నిధి నిమిత్తం అవసరమైన బిల్లులు ఇవ్వాలని కోరారు. ఇదే క్రమంలో చికిత్సకు అయిన మొత్తానికి పత్రాలు అందించారు. బిల్లును ఎక్కువ మొత్తానికి ఇవ్వాలని ఒత్తిడి తేవడంతో ఆయన నిరాకరించారు. దీంతో బాలుని బంధువులు దుర్భాషలాడుతూ డాక్టర్ పై చేయి చేసుకున్నారు. ఈ ఘటనపై ఆగ్రహించిన వైద్యులు తమ ఔట్ పేషెంట్ సేవలను బహిష్కరించి, అదే రాత్రి జాతీయ రహదారి 44పై ధర్నా చేశారు. డాక్టర్ పై దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి చర్యలు చేపట్టాలంటూ నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. డాక్టర్ పై దాడిని నిరసిస్తూ ఆర్య వైశ్య సంఘం, నిర్మల్ లాబ్ టెక్నీషియన్స్ సంఘం, కెమిస్ట్స్ సంఘం, ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు, బీజేపీ కార్యకర్తలు, పారా మెడికల్ సిబ్బంది డాక్టర్లతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. చివరికి ఎస్పీ జానకి షర్మిల అక్కడికి చేరు కున్నారు. దాడికి బాధ్యులైన వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. నింది తులను కఠినంగా శిక్షించాలని నిరసన చేస్తున్న డాక్టర్లు డిమాండ్ చేశారు. ఎస్పీ జానకి షర్మిల ఇచ్చిన హామీ మేరకు వారు ఆందోళన విరమించారు.

### రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేస్తాం..

నిందితులపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేస్తామని ఐ ఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మురళీధర్ తెలిపారు. శుక్రవారం డాక్టర్ మురళీధర్ నేతృత్వంలో డాక్టర్లు స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తో సమావేశమయ్యారు. అనంతరం సంఘ కార్యవర్గ సమావేశంలో చర్చించారు. ఎంఏ అధ్యక్షుడు మురళీధర్ "ముద్ర ప్రతినిధి" తో మా ట్లాడుతూ దాడులను ఖండిం చాలని కోరారు. దాడుల వల్ల అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందకుండా పోయే అవకాశం ఉందన్నారు.

## నేడు నిర్మల్ బంద్

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

పట్టణంలో డాక్టర్ పై దాడికి నిరసనగా స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శనివారం నిర్మల్ బంద్ కు పిలుపు నిచ్చారు. హిందువులపై జరుగుతున్న వరుస దాడులకు నిరసనగా, డా. సంతోష్ రాజ్ పై జరిగిన దాడిలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ పట్టణ బంద్ విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం

**- కలెక్టర్ అభిలాష అభినవ్**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**



జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు సుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యునిపై గురువారం చోటుచేసుకున్న దాడి ఘటనను కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. చట్టాన్ని తమ చేతుల్లోకి ఎవరూ తీసుకోవడానికి వీల్లేదని హెచ్చరించారు. అరాచకానికి పాల్పడే వారిపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తామని తెలిపారు. ఈ ఘటనపై ఇప్పటికే పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందన్నారు. బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో జిల్లాలో వైద్య సేవలకు అంతరాయం కలగలేదని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు యథావిధిగా పనిచేస్తున్నాయన్నారు.

## హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బోథ్ మండల వాసి



**బోథ్, ముద్ర:** తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కౌట–బి గ్రామానికి చెందిన సింగడి సురేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. హైకోర్టు ప్రాంగణంలో జరిగిన ఎన్నికల్లో తన సమీప ప్రత్యర్థి చిక్కుడు ప్రభాకర్ పై 275 ఓట్లతో విజయం సాధించారు. 1999 లో రాష్ట్ర బార్ కౌన్సిల్ లో న్యాయవాదిగా తన పేరును నమోదు చేసుకున్నారు. ఇప్పటికే హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ లో పలు పదవులను నిర్వర్తించిన ఆయన తాజాగా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మారుమూల మండలానికి చెందిన వ్యక్తి హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 28-03-2026
www.mudranews.in | @mudranews



పెట్రోల్, డీజిల్ ఆదా కోసం
భారం తగ్గించండి
వాహనంలో అవసరం లేని బరువు పెడితే మైలేజ్ తగ్గుతుంది. అవసరం లేని వస్తువులు తీసివేయండి.



## వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడిని పరామర్శించిన ఎమ్మెల్యే 'కుంభం'



ముద్ర ప్రతినిధి, భువనగిరి: భువనగిరి పట్టణంలో గురువారం వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన మూడేళ్ల బాలుడు ప్రియాన్ష్ ను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని, కుటుంబ సభ్యులను కలిసి ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొద్ది రోజుల తర్వాత బాలుడికి కత్రిమ కన్ను అమర్చనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. చిన్నారి ప్రియాన్ష్ కంటి చూపు కోల్పోవడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెరిగిపోతున్న వీధి కుక్కల బెడదపై ఇప్పటికే అసెంబ్లీలో కూడా చర్చించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాలుడికి ఇప్పటికే శస్త్రచికిత్స పూర్తయిందని, ప్రస్తుతం అతను క్షేమంగా ఉన్నాడని వైద్యులు వెల్లడించారు. బాలుడి కుడి కన్ను తీవ్రంగా దెబ్బతినడంతో చూపు తిరిగి వచ్చే అవకాశం లేదని వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు.

## వీధి కుక్కల నుండి ప్రజలను కాపాడండి

### - సీపీఐఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ



ముద్ర ప్రతినిధి, భువనగిరి: వీధి కుక్కల నుండి ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఐఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, పట్టణ కార్యవర్గ సభ్యులు గంధ మల్ల మాతయ్యలు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి కాలనీలో వీధి కుక్కలు కోతులతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. పాలకులు, అధికారులు పట్టణ ప్రజలపై నిర్లక్ష్యం వహిస్తున్నారని, కుక్కలు, కోతుల కోసం కేంద్ర ప్రభుత్వం నుండి ప్రత్యేక నిధులు వచ్చినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

## సూర్యాపేట జిల్లాకు ఎస్సారెస్పీ-2 నీటి విడుదల

ముద్ర సూర్యాపేట: సూర్యాపేట జిల్లాకు చివరి విడతగా వారబందీ పద్ధతిలో వచ్చే శ్రీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి శ్రీరాంసాగర్ (శ్రీ ఆర్డీఆర్ ఎస్సారెస్పీ) రెండో దశ జలాలు శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలోని బయన్నవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద సాయంత్రం 4.30 గంటలకు 2.5 మీటర్ల ఎత్తులో గేట్లను ఎత్తి 1510 క్యూసెక్కుల నీళ్లను వదిలారు. ఈ మేరకు వెలిశాల వద్ద ఉన్న 69, 70, 71 డిస్ట్రిబ్యూటర్ల ద్వారా సూర్యాపేట జిల్లాలోకి ప్రవేశించాయి. దీంతో తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల్లో మొత్తంగా, కోదాడ నియోజకవర్గంలోని కొన్ని మండలాలకు నీళ్లు రానున్నాయి. సూర్యాపేట జిల్లాకు రబీ సీజన్ కు సంబంధించి ఈ ఏడాది జనవరి 7న వారబంది పద్ధతిలో తొలిసారిగా నీళ్లు విడుదలయ్యాయి. ఈ నెల 28 తో ఆరు విడతలుగా నీళ్లు విడుదలయ్యాయి. 8 రోజులపాటు నీళ్లు విడుదలై ఆ తర్వాత నిలిచిపోనున్నాయి.

## అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం



ముద్ర ప్రతినిధి, భువనగిరి: జిల్లా వ్యాప్తంగా శ్రీ సీతారాముల కళ్యాణం దేవాలయాలలో శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భువనగిరి పట్టణంలోని అంజనాద్రి ఆలయంలో, ఖిల్లానగర్లోని శ్రీ సీతారామాంజనేయ సహిత సంతోషి మాత ఆలయంలో, శ్రీ పచ్చల కట్ట సోమేశ్వర ఆలయంలో, మాస్ కుంట ఆంజనేయ స్వామి ఆలయంలో, రాంనగర్ లోని రామాలయంలో, కిసాన్ నగర్ లోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం ఆయా దేవస్థానాల కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా జరిపారు. వేలాదిగా భక్తులు పాల్గొన్ని స్వామి వారి కళ్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజూల వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ చైర్మన్ లు, ధర్మకర్తలు, పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### యాదగిరిగుట్టలో..

శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని కొండపైన పర్వత వర్ధిని శ్రీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త భాస్కరాయని నరసింహమూర్తి, దేవస్థాన కార్యనిర్వహణాధికారి భవాని శంకర్ పాల్గొన్నారు.

### స్వర్ణగిరి లో..

పవిత్ర పుణ్యక్షేత్రమైన స్వర్ణగిరిలో శ్రీ రామనవమి వేడుకలు అంబరాన్నంటాయి. శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ రామచంద్ర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి శ్రీవారి వైభవోత్సవ మంటపంలో కొలువుదీర్చారు. ముందుగా పుణ్యహవచనం చేశారు. అనంతరం రక్షాబంధనం యజ్ఞ ఉపవీత ధారణ చేసి గోత్ర ప్రవరలు పఠించారు.



ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం భక్తుల గోవింద నామ స్మరణల నడుమ మాంగళ్య ధారణ గావించారు. స్వామి అమ్మవార్లకు తలంబ్రాలు పోసి మంగళ నీరాజనాలు సమర్పించారు. భక్తులకు వడపప్పు పానకం విశేష అన్న ప్రసాదం అందచేశారు.

### తుంగతుర్తిలో..



ముద్ర, తుంగతుర్తి: శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని తుంగతుర్తి మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయంలోకళ్యాణ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. సీతా రామ లక్ష్మణ విగ్రహాలను ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, పూలతో అలంకరించి, వేద పండితులైన కాటూరి రామాచార్యులు శంకరమంచి శేషు శర్మ, కాటూరి లక్ష్మణచార్యులు ఆధ్వర్యంలో కళ్యాణ మండపం పైకి తీసుకువచ్చి వేదమంత్రాలు మధ్య కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు .సీతారాముల కల్యాణ మహోత్సవం తిలకించడానికి ప్రజలు తరలి వచ్చారు. సీతారాముల కల్యాణానికి తలంబ్రాలు, పట్టు వస్త్రాలను ఏఐసీసీ సభ్యుడు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అందజేశారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి, ఆలయ చైర్మన్ ఎనగందుల సంజీవ, సర్పంచ్ మల్లెపాక సాయి బాబా, తల్లాడ కేదారి, ఉప సర్పంచ్ ఎనగందుల శ్రీనివాస్, సంకినేని గోవర్ధన్ రావు, మేనేని మాధవరావు, బండారు దయాకర్, కాసం మల్లయ్య, కోల వెంకటరామ నరసయ్య, ఉప్పుల రాంబాబు, ఎనగందుల గిరి, కటకం కిష్టయ్య, పెండెం రామ్మూర్తి, గుడుపూరు శ్రీనివాసరావు, కొండా రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### బీబీనగర్ లో..

ముద్ర, బీబీనగర్: శ్రీరామ నవమి సందర్భంగా బీబీనగర్ మండలం రాఘవాపురం, రుద్రవెల్లి, పల్లెగూడం గ్రామాలలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొట్టోల శ్యామ్ గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాఘవాపూర్, రుద్రవెల్లి ,పల్లెగూడం గ్రామాలలో



ఆయా ఆలయ ప్రాంగణాలలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో రాఘవపూర్ సర్పంచ్ సిద్దగోని శ్రీకాంత్ గౌడ్, ఉపసర్పంచ్ సిలివేరు కవిత మహేష్, రుద్రవెల్లి సర్పంచ్ జిల్కపల్లి సరళ అశోక్ రెడ్డి, పల్లెగూడం సర్పంచ్ అప్పారెడ్డి బలరామిరెడ్డి, నాయకులు బండారి ఆగమయ్య గౌడ్, గ్రామ పంచాయతీ పాలక వర్గం, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

### దాచారంలో..

ముద్ర, మోత్కూరు: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని దాచారం గ్రామం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్నే జ్యోతి వీరేశం, ఉప సర్పంచ్ భీమనబాయిన అవిలయ్య, ఆలయ ధర్మకర్త ఎ రామ్మోహన్ రావు, ఆలయ ఈవో పి రామ్ గోపాల్ రావు, ఆలయ అర్చకుడు ప్రతాపురం శ్రీనివాస ఆచార్యులు, మాజీ సర్పంచులు అండెం రజిత రాజిరెడ్డి, కడమంచి వస్తాద్, వార్డు సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.



## అక్రమంగా రవాణా చేస్తున్న మద్యం పట్టివేత

ముద్ర, సూర్యాపేట: అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోదాడ సీఐ నాగార్జున రెడ్డి తెలిపిన ప్రకారం.. నల్లబండ గూడెం గ్రామానికి చెందిన షేక్ జైనిషా అనే వ్యక్తి మేళ్లచెర్వు మండలం రాంపురం గ్రామానికి తన వాహనంపై మద్యం తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు అతడిని వెంబడించి పట్టుకున్నారు. ఈ సందర్భంగా అతని వద్ద ఉన్న వాహనం (హీరో హోండా యాక్టివా), 18 బీర్ బాటిల్స్, 47 లిక్కర్ క్వార్టర్ బాటిల్స్ ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు షేక్ జైనిషాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యాదగిరిగుట్ట దేవస్థానం.. టెండర్ ను రద్దు చేయాలని వినతిపత్రం



ముద్ర ప్రతినిధి, భువనగిరి: యాదగిరిగుట్ట దేవస్థానంలో ఇటీవల నిర్వహించిన ఓ టెండర్ దేవస్థానానికి తీవ్ర నష్టం కలిగించేలా ఉందని, తక్షణమే ఆ టెండరును రద్దు చేయాలని ఆలయ ఈవోకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ యాదగిరిగుట్ట పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి ఆధ్వర్యంలో దేవస్థానం ఈవో భవాని శంకర్ ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నరహరి మాట్లాడుతూ కొండ కింద లక్ష్మీ పుష్కరిణి వద్ద 9, 10 నెంబర్లు గల దుకాణాలలో కూల్డ్రింక్స్, ఐస్ క్రీమ్స్ బనియన్స్, టవల్స్ విక్రయించేందుకు ఇటీవల నిర్వహించిన టెండరును టెండర్ లో పాల్గొన్నవారు సిండికేట్ గా మారి తక్కువ మొత్తానికి దక్కించుకున్నారని ఆరోపించారు. గతంలో కంటే 75% తక్కువ మొత్తానికి అద్దెకు ఇవ్వడం వల్ల దేవస్థానం నష్టపోతుందని అన్నారు. దీనివల్ల గతంలో కంటే దేవస్థానానికి తక్కువ ఆదాయం వచ్చి నష్టం వాటిల్లుతుందని అన్నారు. దీనిపై విచారణ జరిపి ఆ టెండర్ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దేవపూజ అశోక్, మోతే నర సింహ, మిట్ట వెంకటేష్, మోతే బాలు, సర్దార్, మోతే విజయ్, కంసాని స్వామి, మోతే శంకర్, రేఖల రాజు పాల్గొన్నారు

## బార్ అసోసియేషన్లలో సమస్యలపై కృషి చేయాలి

### - ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి



ముద్ర ప్రతినిధి, భువనగిరి: యాదాద్రి భువనగిరి జిల్లాలోని బార్ అసోసియేషన్లలో పేరుకు పోయిన, పెండింగ్ లో ఉన్న సమ స్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పని చేయాలని నూతనంగా ఎన్నికైన భువనగిరి, రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల, యాదగిరిగుట్ట లలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కమిటీలను ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి కోరారు. నూతనంగా ఎన్నికైన కమిటీలకు శుక్రవారం ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో సొంత భవనాలు లేక అద్దె భవనాలలో కోర్టులు నడవడంతో క్లయింట్లు, అడ్వకేట్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నూతన కోర్టు భవనాల సముదాయాలను పూర్తి చేసే విధంగా కమిటీలు పనిసూచించారు. జిల్లాలో వివిధ కోర్టులలో ఉద్యోగుల పోస్టులను త్వరితగతిన భర్తీ కి కృషి చేయాలని, జిల్లాకు రావలసిన లేబర్, ఫ్యామిలీ, ఎస్సీ ఎస్టీ, జ్యువెనల్, కోర్టులు వచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా గౌరవ అధ్యక్షుడు కుక్క దువ్వ సోమయ్య, అధ్యక్షుడు బొల్లెపల్లి కుమార్, ఉపాధ్యక్షులు తడక మోహన్, పాల్వంచ జగతయ్య, ఎండి నేహాల్, సహాయ కార్యదర్శులు సీసా శ్రీనివాస్ సూదగానిశ్రీహరి, చింతల రాజశేఖర్ రెడ్డి కోశాధికారి బొడ్డు కిషన్ పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలల్లోకి వెంపటి నుంచి 28 మంది ఎంపిక



ముద్ర తుంగతుర్తి: తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తుంగతుర్తి మండలంలోని వెంపటి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుండి 28 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు చిత్తలూరి వెంకట్రామనరసమ్మ మాట్లాడుతూ వెంపటి పాఠశాల నుండి 35 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందులో 28 మంది అర్హత సాధించి సీట్లు పొందారని తెలిపారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల, తల్లిదండ్రుల సహకారంతో ఈ విజయం సాధించామని హెచ్ఎం తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు పునాది స్థాయి నుంచే సరైన మార్గదర్శనం, సాధన, పరీక్షలపై అవగాహన కల్పించడం ద్వారా ఈ ఫలితాలు సాధించగలిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీవనపల్లి శ్రీనివాస్, మల్లెపాక రవీందర్, గట్టు మాధవి, నిమ్మర బోయిన నవీన, బండారు భవాని, జీడి అనిల్ కుమార్, మిట్టగడుపుల విక్రమ్, మాలోతు కృష్ణ, గుండ్ల ఆంజనేయులు, రామణ బోయిన మౌనిక, అబ్బగాని మంజుల, శీలోజు రమాదేవి పాల్గొన్నారు.

## రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ముద్ర వరంగల్: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి వరంగల్ – చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ధర్మారం రైల్వే గేట్ సమీపంలో జరిగింది. వరంగల్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ రెడ్డి తెలిపిన ప్రకారం.. సుమారు 35 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి ధర్మారం రైల్వే గేట్ సమీపంలోని మైలురాయి నెంబర్ 382/16–18 వద్ద డౌన్ లైన్‌పై వెళ్తున్న ట్రైన్ నం. 12714 శాతవాహన ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు బ్లూ కలర్ నైట్ ప్యాంట్, సిమెంట్ కలర్ ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడు. రైల్వే అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ మార్చురీ గదిలో భద్రపరిచారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 98497 49220, 8712658627 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
28.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**పెట్రోల్, డీజిల్ ఆదా కోసం క్లచ్‌పై కాలును ఉంచకండి**

డ్రైవ్ చేస్తూ క్లచ్‌పై పాదం ఉంచడం వల్ల ఇంధనం ఎక్కువగా ఖర్చవుతుంది. ఇది క్లచ్ జీవితాన్ని కూడా తగ్గిస్తుంది.






## స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డి ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో దత్తత గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శీతాకాల శిబిరాల్లో భాగంగా స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. కల్పకూర్, అంగడిపేట గ్రామాల్లో 90 మంది విద్యార్థులతో, మల్కాపూర్ గ్రామంలో 45 మంది బాలికలతో కొనసాగుతున్న శిబిరాల మూడవ రోజున స్వచ్ఛత సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం కల్పించారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్పకూర్ గ్రామంలోని కాశీ విశ్వేశ్వర ఆలయం పరిసరాలను విద్యార్థులు శుభ్రపరిచారు. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి దేవాలయం పరిసరాలను పర్వదినానికి అనుగుణంగా పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. అలాగే మల్కాపూర్ గ్రామంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల పరిసరాలను శుభ్రం చేసి పరిశుభ్రత ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. స్వచ్ఛమైన పరిసరాల ద్వారా అంటువ్యాధులను నివారించవచ్చని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పరిశుభ్రత కీలకమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛత ఎంతో దోహదపడుతుందని, కాలుష్యాన్ని తగ్గించడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాల ద్వారా గ్రామాల్లో స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వాలంటీర్లు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ్ కుమార్, డాక్టర్ వాణి పాల్గొన్నారు. కల్పకూర్‌లో ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి మల్లేష్, సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మల్కాపూర్‌లో ఉన్నత పాఠశాల హెచ్ఎం యాదగిరి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సర్పంచ్, ఉపసర్పంచ్‌లు మరియు గ్రామ పెద్దలు విద్యార్థులకు మద్దతు అందించారు.

## చలివేంద్రం ఏర్పాటు



**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చడం కోసం శుక్రవారం జోగిపేట బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంగారెడ్డి డిపో మేనేజర్ శ్రీ ఉపేందర్ హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సేవా సమితి వారు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్, సేవాదళ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు: ఎమ్మెల్యే

**ముద్ర న్యూస్ :**

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీర్కూర్ కోదండ రామాలయాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ అర్హులైన వారు ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి స్థలం ఎంపిక విషయంలో గ్రామ పెద్దలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రఘు, ప్రకాష్, సొసైటీ మాజీ ఛైర్మన్ గాంధీ, దుంపల రాజు, శశికాంత్, సందీప్, కిరణ్ ఉన్నారు.

## కూలీలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

**ముద్ర న్యూస్ :**

కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పిస్తామని బాన్సువాడ సర్పంచ్ లావణ్య అన్నారు. శుక్రవారం బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అర్హులైన కూలీలకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పని ప్రదేశంలో నీడ, తాగునీరు వంటి సౌకర్యాలను కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. సర్పంచ్ వెంట ఫీల్డ్ అసిస్టెంట్ గణేశ్, వార్డు సభ్యులు పోతారాజు తుకారాం, వడ్ల భాగయ్య, కోటారి గంగవ్వ, కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ ప్రవీణ్ గౌడ్, డాక్టర్ సంజీవులు, భానుగౌడ్ తదితరులు ఉన్నారు.



# కమనీయం.. రమణీయం.. శ్రీ సీతారాముల కల్యాణం

- ఊరు, వాడల్లో ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు
- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే రోహిత్ రావు
- కల్యాణోత్సవంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దంపతులు
- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పూజలు
- వేలాదిగా పాల్గొన్న భక్తులు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

శ్రీరామ నవమి వేడుకలు మెదక్ జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం మెదక్‌తో పాటు డివిజన్ కేంద్రాలు నర్సాపూర్, తూప్రాన్, మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం రాములోరి కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు బండ నరేందర్, సభ్యుల ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. అర్చకులు కల్యాణ క్రతువును నిర్వహించారు. వేలాది మంది భక్తులు రామనామ స్మరణతో ఆలయాన్ని మారుమ్రోగించగా సీతారాముల కల్యాణం జరిగింది. అనంతరం ఒడిబియ్యం సమర్పించి అన్నప్రసాదం పంపిణీ చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా టౌన్ సీఐ మహేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. శ్రీరాముడి అనుగ్రహంతో మెదక్ నియోజకవర్గం అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కానుగు రాధికా భూపతిరాజ్, వైస్ ఛైర్మన్ నరేష్ గౌడ్, మాజీ ఛైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు శివరామకృష్ణ, హరిత, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు ముత్యంగౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజల్లో పాల్గొన్నారు. జిల్లా ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీరాముని ఆశీస్సులు రాష్ట్రంపై ఉండాలని ఆకాంక్షిస్తూ, ఆయన గుణగణాలను అందరూ అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ మల్లికార్జున్ గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు మాయ గంగామణి, మల్లేశం, కొట్టాల లలిత విశ్వం, నాయకులు గడ్డమీద కృష్ణ గౌడ్, ఆర్కే శ్రీనివాస్, మాయ మల్లేశం తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు కోదండ రామాలయం సన్నిధిలో నిర్వహించిన కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీరామ నవమి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పగడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ టౌన్ సీఐ మహేష్, ఎస్ఐ విట్టల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలు తీసుకు వస్తున్న ఎమ్మెల్యే



మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి దంపతులు




### ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని 9వ వార్డు సాయికాలనీలో దత్త సమేత సాయిబాబా ఆలయ ఆవరణలో శ్రీరామనవమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి శ్రీరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పూజారి ప్రశాంత్ శర్మ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ కళ్యాణ వేడుక భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. సీతారాముల కళ్యాణాన్ని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 36వ వార్డు కౌన్సిలర్ లాడే మాణిలా మల్లేశం, 9వ వార్డు కౌన్సిలర్ శ్రీలత శ్రీశైలం పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ గౌరవ అధ్యక్షుడు విజేందర్ రెడ్డి, అధ్యక్షుడు శంషాబాద్ శ్రీనివాస్, కార్యదర్శి బిట్ల కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి సాయన్న, కోశాధికారి మొగులయ్య, పురోహితులు ప్రశాంత్ శర్మ, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, రవిశంకర్, స్పోర్ట్స్ రవి, అశోక్ తదితర ప్రముఖులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఏడాది శ్రీరామనవమి వేడుకలను మరింత ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. భక్తుల సహకారంతో కార్యక్రమం విజయవంతమైందని, అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

### జోగిపేటలో ..

శ్రీరామ నవమి సందర్భంగా సంగారెడ్డి జిల్లా ఆందోల్‌జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని జోగిపేటలో నిర్వహించిన శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవంలో అందోల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్ శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ వీర హనుమాన్ దేవాలయం, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం, శ్రీ సీతారామాలయంలో నిర్వహించిన కళ్యాణోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద పంపిణీ కార్యక్రమంలో పాల్గొని సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అందోల్‌జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్ పట్లూరి శివశేఖర్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మల్లికార్జున్ గుప్త, బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, బిర్ల శంకర్, మహేష్ యాదవ్, నాయకోటి అశోక్, ఉస నాగరాజు, అకుల శంకర్, యెర్ర సాయిలు, గాజుల రవి, శంకర్ రావు, ప్రదీప్ గౌడ్ తదితరులు మరియు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



### వేల్పుగొండలో శ్రీరామ నవమి కళ్యాణోత్సవం

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**

ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామంలోని శ్రీరామాచలం గుట్టపై సీతారాముల కళ్యాణోత్సవాన్ని శుక్రవారం నవమి సందర్భంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ శ్రీ శ్రీ పూ.పా. రాజయోగి వెంకట స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం వేద బ్రాహ్మణ పండితులచే గణపతి పూజ, గోపూజ, గురుపూజ, అగ్ని ప్రతిష్ఠ, శ్రీరామ మూలమంత్ర వాహన పూజలు నిర్వహించారు. భజన సంకీర్తనలతో పాటు అఖండ శ్రీరామ రామజపం నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల నుంచి రామాచలం గుట్టపైకి బోనాలు, గండ జ్యోతులతో ఊరేగింపు నిర్వహించిన అనంతరం సీతారాముల విగ్రహాలను కళ్యాణ వేదికపై స్వాగతించి అంగరంగ వైభవంగా వేద బ్రాహ్మణ పండితులచే సీతారాముల కళ్యాణం నిర్వహించారు. కళ్యాణానికి వేల సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి ఆశీర్వాదం తీసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం సీతారాముల పల్లకిసేవను భజన సంకీర్తనలతో గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగింపుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాను ప్రకాష్, ఆలయ కమిటీ సభ్యులు, భక్త బృందం, టేక్మాల్ ఎస్సై అరవింద్ కుమార్, పోలీసు సిబ్బంది, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత లేదు

- కలెక్టర్ ప్రతిమా సింగ్ భరోసా
- 134 సిలిండర్లు సీజ్, 83 కేసులు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, బుకింగ్ చేసుకున్న వారికి యథావిధిగా డెలివరీ జరుగుతోందని, వదంతులను నమ్మవద్దని కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ కొరత ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని కలెక్టర్ తీవ్రంగా ఖండించారు. గ్యాస్ సమృద్ధిగా ఉందన్నారు. రోజుకు సగటున 3వేల సిలిండర్లు బుక్ అవుతుండగా, వాటికి 100 శాతం డెలివరీ జరుగుతోందన్నారు.

అదనంగా జిల్లాలోని గ్యాస్ గోదాముల్లో సుమారు 3,500 సిలిండర్లు నిల్వ ఉండగా, మరో 6,500 సిలిండర్లు రవాణాలో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 87 పెట్రోల్ బంకులు, 16 గ్యాస్ ఏజెన్సీలు సక్రమంగా పనిచేస్తున్నాయని వెల్లడించారు. సరఫరా నిరంతరంగా కొనసాగుతున్నందున ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొన్ని పెట్రోల్ బంకుల వద్ద కనిపిస్తున్న క్యూలు వదంతుల కారణంగా ప్రజలు అవసరానికి మించి కొనుగోలు చేయడం వల్లే ఏర్పడుతున్నాయని తెలిపారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలను అరికట్టేందుకు సివిల్ సప్లైస్, రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ, పోలీస్ శాఖల సంయుక్త బృందాలు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటివరకు మెదక్ జిల్లాలో పలు హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు గృహ అవసరాల కోసం వాడే 134 సిలిండర్లను సీజ్ చేసి, 83 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లా ప్రజలు గమనించాల్సిన విషయం ఏమిటంటే, వాహనాల్లో ఇంధనం తక్కువగా ఉన్నప్పుడే బంకులకు వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వచ్చే ధృవీకరించని వార్తలను ఇతరులకు పంపవద్దని తెలిపారు. ప్రభుత్వం లేదా చమురు కంపెనీల అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని సూచించారు. వదంతులను నమ్మకుండా సంయమనం పాటిస్తే ఈ క్యూలైన్లు తగ్గుతాయన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 9391942254ను సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
28.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**పెట్రోల్, డీజిల్ ఆదా కోసం సరైన గేర్‌లో డ్రైవ్ చేయండి**

తక్కువ స్పీడ్‌లో హై గేర్ లేదా హై స్పీడ్‌లో లో గేర్ వాడితే ఫ్యూయల్ ఎక్కువగా ఖర్చవుతుంది. స్పీడ్‌కు తగ్గ గేర్ వాడాలి.



# కన్నుల పండువగా రాములోరి కళ్యాణం

**ముద్ర, భద్రాచలం :**





శ్రీరామనవమి సందర్భంగా తెలంగాణ అయోధ్యగా పేరు గాంచిన భద్రాచలం లో శ్రీ సీతారాముల కళ్యాణం..వైభవంగా జరిగింది. శుక్రవారం స్వామి వారిని దర్శించుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సతీమణి గీత.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందించారు. ఈ సందర్భంగా భద్రాచలం ఆలయానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. అశేష భక్తజనం జయ జయ ధ్వానాల మధ్య మిథిలా మండపంలో అభిజిత్ లగ్నంలో ఆలయ పూజారులు, వేద పండితులు సీతారాముల కళ్యాణ క్రతువును పూర్తి చేశారు.

**పోటెత్తిన భక్తజనం..!**

భద్రాచలం సీతారాముల కళ్యాణాన్ని కళ్లారా చూసేందుకు అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. శ్రీరామ నామస్మరణతో భద్రాచలం పుర వీధులన్నీ మార్మోగిపోయాయి. ఈ సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు పోటెత్తారు. ఈ కళ్యాణ మహోత్సవానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. భద్రాచలం ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు.

**భారీ ఏర్పాట్లు..!**

రాములోరి కళ్యాణాన్ని చూసేందుకు వచ్చిన భారీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రాచలం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం ముత్యాల తలంబ్రాలు.. లడ్డు ప్రసాదాలను పంపిణీ చేయడం కోసం స్పెషల్ కౌంటర్లు ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశారు. భక్తులు భారీగా తరలి వచ్చిన నేపథ్యంలో వారికి ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ భారీ ఎత్తున బందోబస్తును ఏర్పాటు చేసింది. భద్రాద్రి జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో.. పోలీస్ సిబ్బంది భద్రత ఏర్పాట్లు చేశారు.

**పోచంపల్లి స్టైల్‌లో సీతమ్మకు చీరలు..**

భద్రాచలం శ్రీరామనవమి కళ్యాణోత్సవంలో ప్రభుత్వం తరఫున సమర్పించే పట్టు వస్త్రాలను సుమారు 100 ఏళ్లుగా ఒకే కుటుంబం అందిస్తోంది. సికింద్రాబాద్‌కు చెందిన ఎస్ ఎస్ జయరాజు కుటుంబం.. ఈ పట్టు వస్త్రాలను సిద్ధం చేస్తోంది. ఆ కుటుంబంలోని 3 తరాలు.. ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నాయి. భద్రాచలం ఆలయం ఆవరణలోనే ప్రత్యేకంగా ఒక మగ్గాన్ని ఏర్పాటు చేసి.. పోచంపల్లి స్టైల్‌లో సీతమ్మకు చీరలు.. రామలక్ష్మణులకు పంచెలను నేశారు. రూ.2 లక్షల వ్యయంతో తయారు చేసిన ఈ పట్టు వస్త్రాలను నేడు సీఎం రేవంత్ రెడ్డి దంపతులు స్వామివారికి సమర్పించారు.



# హైదరాబాద్ కేంద్రంగా రూ.217 కోట్ల జీఎస్‌టి స్కాం

- **నగరంలో డిజిజిఐ అధికారుల తనిఖీల్లో వెల్లడి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలుగు రాష్ట్రాల్లో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డిజిజిఐ) అధికారులు భారీ జీఎస్‌టి కుంభకోణాన్ని బయటపెట్టారు. హైదరాబాద్ కేంద్రంగా సాగుతున్న ఈ దందాపై పక్కా సమాచారంతో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏకంగా రూ.217 కోట్ల మేర పన్ను ఎగవేసినట్లుగా జరిగినట్లు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న సుమారు 72 షెల్ కంపెనీల నెట్‌వర్క్ విచారణలో బట్టబయలైంది. ఎలాంటి ఎటువంటి వస్తువుల సరఫరా, సర్వీసు లేకుండా కేవలం ఫేక్ డాక్యుమెంట్లతో రూ.1,472 కోట్ల విలువైన కృత్రిమ లావాదేవీలను సృష్టించినట్లుగా తెలుస్తోంది.

**ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ దోపిడీ..**

నకిలీ లావాదేవీలతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీని ఎగ్గొట్టడమే కాకుండా, తప్పుడు పద్ధతిలో రూ.217 కోట్ల మేర ఐటీసీని క్లెయిమ్ చేసినట్లుగా దర్యాప్తులో తేలింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయాలతో పాటు ఏపీలోని పలు ప్రాంతాల్లో DGGI అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో కీలకమైన డిజిటల్ సాక్ష్యాధారాలు, నకిలీ ఇన్వాయిస్ కాపీలను స్వాధీనం చేసుకున్నారు.

# బీసీ రాజ్యాధికారం దిశగా తీన్మార్ వ్యూహం



- **జూన్ 2 నుంచి రాష్ట్రవ్యాప్త పాదయాత్ర**
- **సన్నాహాలు ముమ్మరం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

వివాదస్పద ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర రాజకీయాల్లో మరో సంచలనానికి తెరలేపారు. తెలంగాణ రాజకీయాల్లో తనదైన శైలిలో దూసుకుపోతున్న ఆయన జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా భారీ పాదయాత్ర చేపట్టనున్నట్లు శుక్రవారం ప్రకటించారు. బీసీలకు, వెనుకబడిన తరగతులు రాజ్యాధికారం కల్పించడమే ఈ యాత్ర వెనుక ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి మల్లన్న పార్టీ 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ' వర్గాలు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. బీసీల సామాజిక న్యాయం, రాజకీయ హక్కులు, వారిని అధికారంలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ఈ సుదీర్ఘ ప్రయాణం సాగనుంది. అయితే ఈ పాదయాత్ర కేవలం ప్రదర్శన మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో వెనుకబడిన వర్గాల బలోపేతానికి ఒక వేదికగా నిలవనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గ్రామగ్రామాన పర్యటించి, బీసీల సమస్యలను వినడమే కాకుండా, వారి రాజకీయ సాధికారతకు అవసరమైన మద్దతును కూడగట్టనున్నారు. ఇప్పటికే రూట్ మ్యాప్ సిద్ధమైనందున, ఏ జిల్లా నుండి యాత్ర ప్రారంభమవుతుంది, ఏయే దశల్లో సాగుతుంది అనే వివరాలు త్వరలోనే అధికారికంగా వెల్లడి కానున్నాయి



# సీఎంలతో మోదీ వర్చువల్ భేటీ

**ముద్ర డెస్క్ :**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల వేళ.. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడుతున్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో రాష్ట్రాల సన్నద్ధతపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న విధానాలను సీఎంలకు ప్రధాని వివరించనున్నట్లు సమాచారం. యుద్ధం మొదలయ్యాక ఇలాంటి సమీక్ష నిర్వహించడం ఇదే తొలిసారి. ఎన్నికలు జరిగే పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి ముఖ్యమంత్రులు మినహా మిగిలిన సీఎంలందరినీ ఆహ్వానించారు.

# 352 కిలోల కుళ్లిన చికెన్..

- **నిందితుడి అరెస్ట్**

**ముద్ర న్యూస్ :**



హైదరాబాద్ నగరంలోని మూసాపేట పరిధి భరత్‌నగర్‌లో చికెన్ సెంటర్‌పై దాడులు నిర్వహించిన ఆహార కల్తీ నిఘా పోలీసులు నిందితుడు సూరజ్ పాల్‌ను అరెస్టు చేశారు. మొత్తం 352 కిలోల కుళ్లిన మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో నిల్వ ఉంచి, స్థానిక హోటళ్లు, విక్రేతలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ గడువు ముగిసినట్లు తెలిపారు. నిందితుడ్ని, స్వాధీనం చేసుకున్న వస్తువులను సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

# లాక్‌డౌన్ పై క్లారిటీ ఇచ్చిన కేంద్రం

- **ఇంధన ఆందోళనల వేళ స్పష్టత**

**ముద్ర డెస్క్ :**




పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో దేశీయంగా ఇంధన కొరత ఆందోళనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు బారులు తీరుతున్నారు. మరోవైపు 'లాక్‌డౌన్' భయాలు వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ దీనిపై స్పష్టతనిచ్చారు. 'లాక్‌డౌన్ వార్తలను కొట్టిపారేసిన కేంద్ర మంత్రి.. ఇంధన లభ్యతకు కేంద్రం చర్యలను వివరిస్తూ వరుస ట్వీట్లు చేశారు. 'అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. ఎనర్జీ, సరఫరా గొలుసు, అత్యవసర సరకు రవాణా వంటి అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. దేశంలో ఇంధన సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. అయితే 'లాక్‌డౌన్'పై వినిపిస్తోన్న ఊహాగానాలు పూర్తిగా అవాస్తవం. అలాంటి ప్రతిపాదనేదీ కేంద్ర ప్రభుత్వం వద్ద లేదు. ఇలాంటి వదంతులు సమాజానికి హాని చేస్తాయి. గందరగోళం సృష్టిస్తాయి. ఈ సమయంలో మనమంతా ప్రశాంతంగా, బాధ్యతాయుతంగా, ఐకమత్యంగా ఉండాలి'' అని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.గత నెల రోజుల్లో అంతర్జాతీయంగా ముడి చమురు బ్యారెల్ ధర 70 డాలర్ల నుంచి 122 డాలర్ల వరకు వెళ్లొచ్చింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. ఆగ్నేయాసియా దేశాల్లో 3050శాతం, ఉత్తర అమెరికాలో 30శాతం, ఐరోపాలో 20శాతం, ఆఫ్రికా దేశాల్లో 50శాతం మేర ఇంధన ధరలు పెరిగాయి. కానీ, మన దేశంలో పౌరుల ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ వీటిని పెంచలేదు. అంతేగాక, చమురు కంపెనీల అధిక నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వ పన్ను ఆదాయాన్ని తగ్గించుకున్నాం (ఎక్సైజ్ సుంకం తగ్గింపును ఉద్దేశిస్తూ). అదే సమయంలో విదేశాలకు ఎగుమతి చేసే ఇంధనంపై ఎగుమతి పన్ను విధించాం'' అని పురీ వెల్లడించారు.

**డీజిల్‌పై రూ.21.5శాతం**

విదేశాలకు ఎగుమతి చేసే డీజిల్ పై లీటర్‌కు రూ.21.5 చొప్పున పన్ను విధించినట్లు కేంద్రం ప్రకటన విడుదల చేసింది. ఇక, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ (ఏటీఎఫ్)పై లీటర్‌కు రూ.29.5శాతం పన్ను విధిస్తున్నట్లు తెలిపింది. వాస్తవానికి 2024లో కేంద్రం ఇంధన ఎగుమతులపై పన్నులను తొలగించింది. అయితే, ప్రస్తుతం పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో వీటిని మళ్లీ ప్రవేశపెట్టింది. ఇదిలాఉండగా పెట్రోల్ పై అదనపు ఎక్సైజ్ సుంకాన్ని రూ.13 నుంచి రూ.3కు తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇక, డీజిల్‌పై రూ.10 ఉన్న సుంకాన్ని పూర్తిగా ఎత్తేసింది. దీంతో చమురు మార్కెటింగ్ కంపెనీలకు భారీ ఊరట లభించనుంది.




# యుద్ధానికి బ్రేక్

- **మరో 10 రోజులు విరామం**
- **గడువుపించిన అమెరికా అధ్యక్షుడు**

**ముద్ర డెస్క్**

అమెరికా అధ్యక్షుడు యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో మరో 10 రోజుల గడువు ప్రకటించారు. పరిస్థితులు కొంత సద్దుమణిగేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే మరో వైపు ఖర్గే ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.ఈ పరిణామాలపై అప్రమత్తమైన ఇరాన్, ద్వీపం చుట్టూ భారీగా మందుపాతరలను అమర్చింది. భూతల యుద్ధానికి సన్నద్ధంగా దాదాపు 10 లక్షల మంది సైన్యాన్ని సిద్ధం చేసినట్లు సమాచారం.ఇక అమెరికా సైనిక చర్యలు మాత్రం ఆగలేదు. ఆధునిక డ్రోన్ బోట్లు రంగంలోకి దింపుతూ పరిస్థితిని మరింత ఉత్కంఠభరితంగా మార్చుతోంది. మొత్తం మీద విరామం ప్రకటించినప్పటికీ, యుద్ధ మేఘాలు ఇంకా చెదరని పరిస్థితి నెలకొంది.

# చమురు కంపెనీలకే ఎక్సైజ్ లాభం

- **పెట్రోల్, డీజిల్‌పై లీటర్ కి రూ.10 ట్యాక్స్ తగ్గింపు**
- **చమురు కంపెనీలకు లాభం**
- **రాష్ట్రంలో ఇంధన రేట్లు తగ్గే చాన్స్ లేనట్టే**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

పెట్రోల్, డీజిల్ ధరలపై ఎక్సైజ్ సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. అమెరికా ఇరాన్ యుద్ధం కారణంగా ధరలు పెరిగే అవకాశం ఉందని ఈ నిర్నయం తీసుకుంది.అమెరికాఇరాన్ ఉద్రిక్తతల వేళ దేశవ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉన్నందున, భారత ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై అదనపు ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గించింది. గురువారం విడుదల చేసిన జీవో ప్రకారం, పెట్రోల్ పై అదనపు ఎక్సైజ్ ట్యాక్స్ లీటరుకు రూ.13 నుంచి రూ.3కి తగ్గించారు. డీజిల్ పై ఎక్సైజ్ సుంకం లీటరుకు రూ.10 నుంచి 0కి తగ్గించారు.


**పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయా..**

కేంద్రం చేసిన పన్నుల తగ్గింపు వల్ల సామాన్య వినియోగదారులకు పెట్రోల్ తక్కువ ధరకు లభించే అవకాశం లేదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (OMCs) పంపు విక్రయాలపై ఎదుర్కొంటున్న భారీ నష్టాలను భర్తీ చేసుకోవడానికి ఈ తగ్గింపును అవే వినియోగించుకునే అవకాశం ఉంది. పెట్రోల్, డీజిల్ ధరలు ప్రస్తుతానికి యథాతథంగా ఉండనున్నాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ ధరలు బ్యారెల్‌కు 100 అమెరికన్ డాలర్లు దాటాయి. దీనివల్ల ప్రస్తుతం ఓఎంసీలు విక్రయించే ప్రతి లీటరు పెట్రోల్ లేదా డీజిల్‌పై రూ. 48.8 నష్టపోతున్నాయి. రష్యా కంపెనీ రోస్నెఫ్ట్, కేసాని ఎంటర్‌ప్రైజెస్ మద్దతు ఉన్న దేశీయ అతిపెద్ద ప్రైవేట్ ఇంధన విక్రయ సంస్థ నయారా ఎనర్జీ, పెట్రోల్, డీజిల్ ధరలను రూ. 5.3, రూ. 3 పెంచిన తరువాత రోజే ప్రభుత్వం ఈ ఎక్సైజ్ సుంకం తగ్గింపు నిర్ణయం తీసుకుంది.

ఇరాన్ హర్మూజ్ జలసంధిపై ఆంక్షలు విధించిన కారణంగా ఏర్పడిన ప్రపంచ ఇంధన సంక్షోభం సమయంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. హర్మూజ్ జలమార్గం ప్రపంచానికి ఒక ముఖ్యమైన ఇంధన సరఫరా మార్గం. 20 నుండి 25 మిలియన్ బ్యారెల్స్ ముడి చమురు, దాదాపు 10 బిలియన్ క్యూబిక్ అడుగుల గ్యాస్ ఈ మార్గం ద్వారా సరఫరా అవుతుంది.

**ఏటీఎఫ్ పై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం అమలు**

అంతేకాకుండా, కేంద్ర ప్రభుత్వం మొదటిసారిగా ఏవియేషన్ టర్బైన్ ఇంధనంపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని విధించింది. కొత్త నిబంధనల ప్రకారం, ATF పై లీటరుకు ₹50 పన్ను నిర్ణయించారు. మినహాయింపు తరువాత, ఎఫెక్టివ్ రేటు లీటరుకు 29.5కి తగ్గించారు. ఇది విమానయాన సంస్థల వ్యయాన్ని పెంచే అవకాశం ఉంది.



**దేశీయ చమురు కంపెనీలకు పెద్ద ఉపశమనం**

ప్రభుత్వం పెట్రోల్ పై పన్నును పూర్తిగా తొలగించింది. అయితే డీజిల్ పై లీటరుకు ₹18.5 చొప్పున నిర్ణయించింది. ఎగుమతుల కోసం పెట్రోల్, డీజిల్ , ATF పై అనేక సుంకాల నుండి మినహాయింపు ఇచ్చారు. దీనితో పాటు 2022లో అమలులోకి వచ్చిన విండ్‌ఫాల్ టాక్స్ కూడా రద్దు చేశారు. దీనివల్ల దేశీయ చమురు కంపెనీలకు ఉపశమనం లభిస్తుంది. ఈ మార్పులన్నీ అమలులోకి వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం గురువారం తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. భారత్ వద్ద సుమారు 60 రోజులకు సరిపడా చమురు నిల్వలు, 30 రోజులకు సరిపడా ఎల్‌పీజీ సిలిండర్లు ఉన్నాయని తెలిపింది. కొరత గురించి వస్తున్న నివేదికలను కొట్టిపారేసింది. ముడి చమురు, ఎల్‌పీజీ దిగుమతులను పెంచడానికి ప్రభుత్వం కొత్త ఒప్పందాలను వేగవంతం చేసినట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి ఈ వారం పార్లమెంటులో మాట్లాడుతూ, భారత్ లోని మూడు వ్యూహాత్మక నిల్వ కేంద్రాలలో ప్రస్తుతం సుమారు 3.372 మిలియన్ టన్నుల చమురు ఉందని, ఇది వాటి గరిష్ట సామర్థ్యంలో మూడింట రెండు వంతులని తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
28.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**పెట్రోల్, డీజిల్ ఆదా కోసం రూట్ ప్లాన్ చేసుకోండి**

ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న రూట్లను తప్పించండి. చిన్నదైనా స్మార్ట్ రూట్ ఎంచుకుంటే ఇంధనం ఆదా అవుతుంది.



## సిర్సనగండ్ల ను దక్షిణ అయోధ్యగా అభివృద్ధి

- **రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి మంత్రి జూపల్లి కృష్ణారావు**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్ :**

సిర్సనగండ్లను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి "దక్షిణ అయోధ్య"గా తీర్చి దిద్దుతామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. చారిత్రాత్మక పుణ్యక్షేత్రమైన సిర్సనగండ్లలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న అనంతరం మాట్లాడారు. సిర్సనగండ్ల క్షేత్రానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను కాపాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. మంత్రితో పాటు ఆలయానికి విచ్చేసిన అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించగా, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి, "జై శ్రీరామ్" నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

## వివాదాల నడుమ సీతారాముల కల్యాణం

**ముద్ర, గద్వాల:**



మల్దకల్ మండలం పెద్దపల్లి గ్రామంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం గురువారం రాజకీయ రంగు పులుముకుంది. గురువారం కల్యాణోత్సవాన్ని తామే నిర్వహిస్తామని ప్రస్తుత సర్పంచ్, మాజీ సర్పంచ్ వర్గీయుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటు చేసుకోవడంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. దీంతో ఒకరిపై ఒకరు అధికారులకు ఫిర్యాదు చేసుకోవడంతో గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవ నిర్వహణలో పైచేయి సాధించేందుకు ఇరువర్గాలు పట్టుబట్టడంతో, భక్తుల మనోభావాలు, శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. వివాదానికి కారణమైన ఇరు వర్గాలను పక్కన పెట్టి, నేరుగా ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలోనే కల్యాణాన్ని నిర్వహించాలని జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయించారు. శుక్రవారం శ్రీరామనవమి పురస్కరించుకుని పెద్దపల్లి గ్రామంలో శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో మల్దకల్ తహసీల్దార్ ఝాన్సీ దంపతులు స్వయంగా ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించి శ్రీ సీతారాముల స్వామి వారి కల్యాణోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మల్దకల్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజకీయాలకు తావులేకుండా కేవలం భక్తిశ్రద్ధలతో ఉత్సవం నిర్వహించడం పట్ల సాధారణ భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఆలయ పూజారులు మరియు గ్రామ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రధాని నిర్ణయంతో ప్రజలకు ఊరట

- **పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకం తగ్గించినందుకు ధన్యవాదాలు**

**ముద్ర, విజయవాడ:**

ప్రధాని మోదీ అనుక్షణం దేశ ప్రజల క్షేమం కోరుకునే నాయకుడని మరోసారి నిరూపించుకున్నారని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితులు ఎదురైన ప్రతిసారీ ప్రజలకు అండగా ఉంటామని ఆయన చాటుకుంటున్నారని అన్నారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశ ప్రజలపై పడకుండా పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకం తగ్గించి ఇంధన భారం నుంచి ఊరట కల్పించారని అన్నారు. ప్రపంచం మొత్తం ఇంధన సంక్షోభంలో చిక్కుకున్న వేళ ప్రధాని మోదీ తన దౌత్య నీతితో ఆ ప్రభావం మనపై పడకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నారని అన్నారు. ఇంధన కొరత రాకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తూనే, ప్రజలపై భారం పడకుండా తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ఆయన శ్లాఘించారు.. పెట్రోల్ పై ఎక్సైజ్ సుంకాన్ని రూ.10 తగ్గించడంతోపాటు డీజిల్ పై ఉన్న సుంకాన్ని పూర్తిగా రద్దు చేసినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయం దేశ ప్రజలతోపాటు చమురు సంస్థలకు కూడా ఊరటనిస్తుందని ఆయన అన్నారు.

## ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక శోభ

**ముద్ర, విజయవాడ:**

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని, శ్రీరామనవమి పర్వదినాన శుక్రవారం సాయంత్రం రాజగోపురం వద్ద ఉన్న కళావేదికపై ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ప్రముఖ భాషా ప్రవీణ, సంస్కృత భాషా ప్రచారకులు శ్రీ మైలవరపు లక్ష్మీనరసింహం ఈ ప్రవచనాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు "త్రిశక్తి వైభవం" , "శ్రీరామనవమి విశిష్టత" గురించి భక్తులకు వివరించారు. దుర్గామల్లేశ్వరుల సన్నిధిలో రామకథను వినడం భక్తులకు కనువిందుగా నిలిచింది. అమ్మవారి శక్తికి, రాముని ధర్మానికి ఉన్న అవినాభావ సంబంధాన్ని వారు తమ ప్రసంగంలో చక్కగా విశ్లేషించారు. కార్యక్రమం అనంతరం ఆలయ చైర్మన్ శ్రీ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఈవో శ్రీ శీనా నాయక్, ప్రవచనకర్త శ్రీ మైలవరపు లక్ష్మీనరసింహంను శాలువాతో ఘనంగా సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య శ్రీ విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు శ్రీ శంకర శాండిల్య, ఇతర దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. యంత్రం వేళ అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ప్రవచన కార్యక్రమాన్ని వీక్షించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు.

# బీరు షాక్..




- **బీర్ల ధరల పెంపునకు చాన్స్**
- **తయారీ ఖర్చులు పెరిగాయి**
- **ప్రభుత్వానికి కంపెనీల ప్రతిపాదనలు**
- **ఒక్కో కేసుపై రూ. 35 వరకు పెరిగే అవకాశం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో మందు బాబులకు షాక్. బీర్ల ధరలకు భారీగా పెరుగుతున్నాయి. ప్యాకేజింగ్ ఖర్చులు పెరగడంతో కంపెనీలకు మార్జిన్ ఖర్చులు తగ్గుతున్నాయి. దీంతో తక్షణమే ధరలను పెంచేందుకు కంపెనీలు సిద్ధం అయ్యాయి. కొద్ది రోజుల వ్యవధిలోనే బీర్ల ఉత్పత్తికి ఖర్చు 15 శాతం పెరిగింది. కాగా, ఇదే సమయంలో విదేశీ బ్రాండ్ల ఉత్పత్తుల్లోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా అమ్మకాలు భారంగా మారుతున్నాయి. దీంతో.. బీర్ల ధరల పెంపు కు రంగం సిద్ధం చేసారు. కొత్త ధరలు ఫిక్స్ అయ్యాయి. బీర్ల ధరల పెంపుకు రంగం సిద్ధమైంది. బీర్ల ఉత్పత్తి ధరలు గణనీయంగా పెరిగాయి. ఫలితంగా ఆ భారం కొనుగోలు దారుల పైన మోపేందుకు కంపెనీలు సిద్ధమయ్యాయి. ధరలను పెంచక తప్పద ని బ్రూవర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది. ఉత్పత్తి ట్యాక్సులు, ఇతర ఖర్చులు పెరగడంతో బీర్ల తయారీ కంపెనీలు సతమతమవుతున్నాయి. పన్నుల కారణంగా ఉత్పత్తి ఖర్చులు 12 నుంచి 15 శాతం వరకు పెరిగాయని, కంపెనీలపై అదనపు భారం పడుతుందని స్పష్టం చేసింది. ఇదే సమయంలో బీరు సీసాల ధరలు ధరలు 20 శాతం పెరిగాయి. ఇక ఇతర మెటిరీయల్ ఖర్చులు కూడా 20 నుంచి 25 శాతం పెరిగాయి. రవాణా ఖర్చులు కూడా 10 శాతం మేర పెరిగటంతో.. బీర్ల ధరల పెంపు అనివార్యంగా మారిందని చెబుతున్నారు. ప్రధానంగా ఏబీ ఇన్‌బెవ్, కార్ల్‌బర్గ్ కంపెనీలు 85 శాతం బీర్ అమ్మకాలను చేపడుతున్నాయి.


**ప్రతిపాదనలు సిద్ధం చేసిన తయారీ కంపెనీలు**

ఇలా అన్ని రకాలుగా ఖర్చులు పెరుగుతుండటంతో బీర్ల ధరలను పెంచాలని కంపెనీలు తాజాగా ప్రతిపాదనలు సమర్పించాయి. ప్యాకేజింగ్ ఖర్చులు పెరగడంతో కంపెనీలకు మార్జిన్ ఖర్చులు తగ్గుతున్నాయి. ఈ క్రమంలో ప్రతీ బీర్ కేస్‌పై రూ.20 మేర ధరను పెంచేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వాలకు ఈ అంశం పైన ప్రతిపాదనలు సమర్పించారు. రేట్లు పెంపు పైన ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకొని.. అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇరాన్ ఇజ్రాయెల్అమెరికా యుద్ధంతో ఇప్పటికే ఇండియాలో చమురు సంక్షోభం మొదలైంది. మరోవైపు ఔషధాల ధరలు కూడా పెరగొచ్చు. ఈ నేపథ్యంలో ఇండియన్స్‌కు మరో షాక్ తగిలే అవకాశం ఉంది. విదేశీ బ్రాండ్లు తమ బీర్ల ధరలు పెద్ద మొత్తంలో పెరగనున్నాయి. లాస్ బాటిల్ ధరలు 20 శాతం పెరిగాయి. అలాగే, బీర్లను ఉంచే పేపర్ కార్టన్ రేట్లు కూడా రెట్టింపైనట్లు తయారీ కంపెనీలు చెబుతున్నాయి. లేబుల్స్, టేప్స్ వంటి ధరలు కూడా పెరిగాయి. పరిశ్రమలకు గ్యాస్ సరఫరా లేకపోవడంతో వీటన్నింటి తయారీ సంస్థలు తమ తయారీని తగ్గించాయి. వేసవి కాలం కావడం, డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తమపై భారం తగ్గాలంటే 12 శాతం నుంచి 15 శాతం వరకు ధరలు పెంచాలని కోరుతున్నాయి. దీంతో, ఒకటి రెండు రోజుల్లో బీర్ల ధరల పైన అధికారికంగా నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

# భారత్‌కు ఫుల్ ఎనర్జీ..

- **ఇక రెండు నెలలు ఢోకాలేదు**

**ముద్ర డెస్క్ :**



గల్ఫ్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన కొరత ప్రపంచ మార్కెట్లను అతలాకుతలం చేసింది. లక్షల కోట్ల సంపద ఆవిరైంది. చమురు, ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ కొరత ఏర్పడింది. పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. మరోవైపు భారత్‌లో చమురు కొరత లేకపోయినా ఎల్‌పీజీ కొరత ఏర్పడింది. దీంతో కేంద్రం గృహ, కమర్షియల్ గ్యాస్ ధరలు పెంచింది. అయినా ఎల్‌పీజీ సరిపడా లేకపోవడంతో కమర్షియల్ సరఫరా నిలిపివేసింది. తాజాగా ఐదు రోజుల యుద్ధ విమరణ, భారత్ ఇరాన్‌తో జరిపిన చర్చలు, ఇరుదేశాల దౌత్య సంబంధాలతో హార్ముజ్‌లో చిక్కుకున్న భారత నౌకలు భారత్‌కు వస్తున్నాయి. ఈ క్రమంలో భయాలను పటాపంచలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. రాబోయే 60 రోజులకు దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి లోటు ఉండదని, వంటగ్యాస్ (ఎల్‌పీజీ) సరఫరా కూడా యథావిధిగా సాగుతుందని స్పష్టం చేసింది.

**రెండు నెలలకు సరిపడా నిల్వలు..**

కేంద్ర పెట్రోలియం శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం..దేశంలోని ప్రతీ పౌరుడి అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయి. వచ్చే 60 రోజులకు సరిపడా స్టాక్ సిద్ధంగా ఉంది. తర్వాతి రెండు నెలలకు అవసరమైన ముడిచమురు దేశానికి చేరుతోంది. హార్ముజ్ జలసంధి మూతపడినా, ఇతర మార్గాల ద్వారా 70% క్రూడాయిల్ సరఫరా కొనసాగుతోంది. అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, ఇతర దేశాల నుంచి 8 లక్షల టన్నుల ఎల్‌పీజీ దిగుమతికి ఏర్పాట్లు జరిగాయి. వచ్చే నెల రోజుల వరకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

**అనవసర బుకింగ్స్‌తో ఇబ్బందులు..**

గ్యాస్ కొరత వస్తుందనే భయంతో ప్రజలు ముందే బుక్ చేసుకోవడం వల్ల తలెత్తింది. గత కొన్ని రోజులుగా డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో తాత్కాలిక ఆలస్యం జరిగినా, సరఫరా వ్యవస్థ పూర్తి స్థాయిలో పనిచేస్తోంది. గృహ వినియోగదారులకు వంద శాతం ఎల్పీజీ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం ధ్రువీకరించింది.

**భారత్ ఇంధన భద్రతా వ్యూహం**

భారత్ ఇంధన భద్రత కోసం 85 శాతం క్రూడ్ ఆయిల్ దిగుమతిని 41కిపైగా దేశాల నుంచి కొనసాగిస్తోంది. రిఫైనరీలన్నీ వంద శాతానికిపైగా సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. మరోవైపు 8 లక్షల టన్నుల ఎల్‌పీజీ అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా నుంచి వస్తోంది. దీంతో పెట్రోల్ 60 రోజులకు, డీజిల్ 90 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయి.

ప్రపంచంలో ఏం జరిగినా భారత ఇంధన భద్రతకు లోటు లేదని కేంద్రం స్పష్టం చేసింది. వ్యూహాత్మక నిల్వలు, వైవిధ్యీకృత దిగుమతి మార్గాలు, పూర్తి సామర్థ్యంతో నడుస్తున్న రిఫైనరీలు దేశాన్ని ఇంధన సంక్షోభం నుంచి కాపాడుతున్నాయి. ప్రజలు ధైర్యంగా ఉండి, పుకార్లకు భయపడకుండా సాధారణ వినియోగం కొనసాగించాలి.

**సరఫరా వ్యూహంలో మార్పులు**

ఇరాన్ యుద్ధం కారణంగా హార్ముజ్ జలసంధి వద్ద ప్రతికూల పరిస్థితులు ఉన్నా, భారత్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న 41కి పైగా దేశాల నుంచి క్రూడాయిల్‌ను దిగుమతి చేసుకుంటోంది. ఇంతకు ముందు హార్ముజ్ ద్వారా వచ్చిన దానికంటే ఎక్కువ ముడిచమురు ఇప్పుడు ఇతర మార్గాల్లో వస్తోంది. దేశంలోని అన్ని చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) వంధశాతం కన్నా ఎక్కువ సామర్థ్యంతో పనిచేస్తున్నాయి.



## రామభక్తుల పై దాడి పై మాధవ్ సీరియస్

**ముద్ర, అమరావతి:**

హిందువులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపే శ్రీరామ నవరాత్రి ఉత్సవాలు లో కొందరు దుండగులు అత్యంత పాశవికంగా దాడి చేయడాన్ని ఏపీ బీజేపీ చీఫ్ పివిఎన్ మాధవ్ తీవ్రంగా ఖండించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు పెదపేట లోని రామాలయానికి రామ భక్తులతో ఉపసభాపతి రఘురామకృష్ణం రాజు దర్శనానికి వెళ్లిన సందర్భంగా కొంతమంది దుండగులు ఉద్దేశ్యపూర్వకంగానే మారణాయుధాలతో కూటమి నేతలు, కార్యకర్తలపై దాడి చేయడాన్ని ప్రభుత్వం సీరియస్ గా తీసుకోవాలని మాధవ్ డిమాండ్ చేశారు. ఈ దాడికి పాల్పడ్డవారని, వీరికీ సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలి. ఈ మొత్తం వ్యవహారం పై సీరియస్ గా దర్యాప్తు చేయాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని మాధవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# సెల్ ఫోన్ దొంగల ముఠా గుట్టురట్టు

- **25 ఖరీదైన ఫోన్లు స్వాధీనం**
- **సీసీఎస్ ఇన్ స్పెక్టర్ బల్వంత్ రాయ్**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**



వికారాబాద్ జిల్లాలో రద్దీగా ఉండే కూరగాయల మార్కెట్ ప్రాంతాలలో ఖరీదైన సెల్ ఫోన్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను జిల్లా సీసీఎస్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వికారాబాద్, బొంరాస్ పేట్ పోలీస్ స్టేషన్ లలో చోరీ అయిన సెల్ సెల్ ఫోన్‌లతో పాటు సుమారు 3,75,000 రూపాయల విలువ కల్గిన మొత్తం 25 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో సెల్ ఫోన్ దొంగతనాలను నివారించడానికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్, వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘు కుమార్ ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లాలోని వికారాబాద్, బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన సెల్ ఫోన్ దొంగతనాల కేసులపై దర్యాప్తు ప్రారంభించిన సీసీఎస్ బృందం, సీసీటీవీ ఫుటేజ్, టెక్నికల్ ఆధారాలను విశ్లేషించి నిందితుల కదలికలను గుర్తించింది. ఈ క్రమంలో సెల్ ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను గుర్తించి కర్నూల్ జిల్లా డోన్ మండలంకు చెందిన కే. రవి అలియాస్ గౌరి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు తనతో పాటు మరో ఐదుగురు పెద్దవారు, ముగ్గురు మైనర్ బాలుర సహాయంతో వికారాబాద్ పోలీస్ స్టేషన్, బొంరాస్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలలో జిల్లాలోని రద్దీ ప్రాంతాలలో దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ముఠా సభ్యులు ఆటోలు బైక్‌లపై తిరుగుతూ, రద్దీ మార్కెట్‌లలో ఖరీదైన సెల్ ఫోన్‌లను లక్ష్యంగా చేసుకుని, ప్రజలు కూరగాయలు కొనుగోలు చేస్తూ అప్రమత్తంగా లేని సమయంలో మైనర్ బాలురతో దొంగతనాలు చేయించేవారు. అనంతరం సెల్ ఫోన్‌లను వెంటనే ముఠా సభ్యుల మధ్య మార్చుకుంటూ ఆధారాలు లేకుండా చేశారని తెలిపారు. సీసీఎస్ పోలీసులు, వికారాబాద్ పోలీసులు నిందితులు అద్దెకు తీసుకున్న నివాస ప్రాంతంలో సోదాలు నిర్వహించి, మొత్తం 25 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసులో నిందితులను గుర్తించారు. అరెస్టయిన వారిలో కె. రవి (అలియాస్ గౌరి): కర్నూలు జిల్లాకు చెందిన కె.రవి అలియాస్ గౌరి, మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మహేశ్, హైదరాబాద్ శేరిలింగంపల్లికి చెందిన ఆకుల కార్తీక్, మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల కు చెందిన వడ్డే మురళి, మహబూబ్ నగర్‌లోని బాలానగర్ కు చెందిన వడ్డే వెంకటేష్, హైదరాబాద్, పాపిరెడ్డి కాలనీకి చెందిన సంపంగి తిరుపతి ఉన్నారు. ఈ సందర్భంగా సీసీస్ ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ మాట్లాడుతూ రద్దీ ప్రదేశాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఖరీదైన మొబైల్ ఫోన్‌లను జాగ్రత్తగా ఉంచుకోవాలని, ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సెల్ ఫోన్ దొంగతనాలు చిన్న నేరాలు కావని, వీటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాము. ఈ ముఠా పట్టుబడటంలో కీలకంగా వ్యవహరించిన సీసీస్ టీం, వికారాబాద్ పోలీస్ టీం సిబ్బందిని అభినందించారు. నేరస్థులందరూ పాత నేరస్థులేనని, వారిపైన వివిధ పోలీస్ స్టేషన్ లలో పలు కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘు కుమార్, సీసీస్ ఎస్.ఐ రమేష్, రాజు, రామ కృష్ణ, రవీందర్, రమేష్, ముని రాజ్ పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ ఆదా కోసం ఎయిర్ కండిషనర్ వినియోగం తగ్గించండి
అవసరం ఉన్నప్పుడు మాత్రమే AC వాడండి. AC ఎక్కువగా వాడితే ఫ్యూయల్ వినియోగం పెరుగుతుంది.




# ఘనంగా శాసనసభ్యుల క్రీడోత్సవాలు



- **స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి**

**ముద్ర, హైదరాబాద్:**

ఎల్‌బీ స్టేడియంలో ప్రారంభం కానున్న శాసనసభ్యుల క్రీడోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు. ఫస్ట్ ఎడిషన్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్-2026 ఏర్పాట్లను స్పోర్ట్స్ అథారిటీ ఎండీ డాక్టర్ సోనీ బాలాదేవితో కలిసి పరిశీలించారు. రాష్ట్రంలో క్రీడల పట్ల అవగాహన పెంచాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దాదాపు 14 సంవత్సరాల తరువాత తొలిసారిగా ఈ క్రీడా పోటీలను నిర్వహించడం ప్రత్యేకమని తెలిపారు. పార్టీల భేదాభిప్రాయాలు లేకుండా అన్ని పక్షాల శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ఈ పోటీలలో పాల్గొనడం సంతోషకరమని అన్నారు. రాష్ట్రంలో క్రీడలపై ఆసక్తి పెంచేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ క్రీడోత్సవాల్లో టగ్ ఆఫ్ వార్, ఫుట్‌బాల్, క్రికెట్, అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌తో పాటు కొన్ని వినోదాత్మక క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలను వీక్షించేందుకు ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని, అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచామని వెల్లడించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# 2026 వేటకు సిద్ధమైన చెన్నై..

- **ఈసారి కుర్రాళ్లపైనే నమ్మకం**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ చరిత్రలో ముంబయి ఇండియన్స్‌తో సమానంగా ఐదు సార్లు టైటిల్ గెలిచిన చెన్నై సూపర్ కింగ్స్ గత సీజన్‌లో మాత్రం పేలవ ప్రదర్శన చేసింది. 14 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు విజయాలతో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. అయితే ఈ నిరాశను దృష్టిలో పెట్టుకుని 2026 సీజన్‌కు ముందుగానే సన్నాహాలు ప్రారంభించిన చెన్నై ఈసారి పూర్తి భిన్నంగా కనిపించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. గత సీజన్ చివర్లో యువ ఆటగాళ్లు మెరుగైన ప్రదర్శన చేయడంతో జట్టుపై మళ్లీ ఆశలు పెరిగాయి. గత ఏడాది చెన్నై బ్యాటింగ్‌పై తీవ్ర విమర్శలు వచ్చినా, చివరి దశలో కొందరు యువ బ్యాటర్లు ఆకట్టుకున్నారు. ముఖ్యంగా యువ ఆటగాడు ఆయుష్ మాత్రే తక్కువ మ్యాచ్‌ల్లోనే వేగంగా పరుగులు సాధిస్తూ జట్టుకు దూకుడు తీసుకొచ్చాడు. అలాగే డెవాల్డ్ బ్రెవిస్, ఉర్విల్ పటేల్ వంటి ఆటగాళ్లు కూడా మెరుపు ఇన్నింగ్స్‌లతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ ముగ్గురు ఈ సీజన్‌లో చెన్నై బ్యాటింగ్‌కు కీలకంగా మారే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటివరకు సీనియర్ ఆటగాళ్లపైనే ఎక్కువగా ఆధారపడిన చెన్నై ఈసారి యువ ఆటగాళ్లపైనే దృష్టి పెట్టినట్లు కనిపిస్తోంది. వేలంలో కార్తీక్ శర్మ, ప్రశాంత్ వీర్ వంటి యువ ఆటగాళ్లను భారీ మొత్తాలకు కొనుగోలు చేసింది. సంజు శాంసన్, శివమ్ దూబే వంటి ఆటగాళ్లు కూడా జట్టుకు బలం చేకూరుస్తుండగా, బౌలింగ్ విభాగంలో నూర్ అహ్మద్, అన్షుల్ కాంబోజ్ వంటి యువ బౌలర్లపై ఆశలు పెట్టుకుంది. ఈ యువశక్తి చెన్నైకి ఈ సీజన్‌లో ఎంతవరకు విజయాలు అందిస్తుందో చూడాలి.





# ఆర్సీబీ వర్సెస్ సన్ రైజర్స్.. గెలుపెవరిది?

- **డిఫెండింగ్ ఛాంపియన్ ను సన్ రైజర్స్ అడ్డుకుంటుందా?**
- **రెండు జట్ల బలబలాలు ఇవీ?**

ఎన్నిరోజులుగా ఎదురుచూస్తున్న ఐపీఎల్ రానే వచ్చింది. శనివారం నుంచి ఐపీఎల్ మొదలు కాబోతోంది. ప్రారంభ మ్యాచ్ డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య జరగనుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఈ మ్యాచ్ నిర్వహిస్తారు. ఇప్పటికే ప్రారంభ మ్యాచ్ కు సంబంధించి నిర్వాహక కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.గత ఏడాది ట్రోఫీ గెలిచి బెంగళూరు భీకరమైన ఫామ్ లో ఉంది. గత ఏడాది హైదరాబాద్ ఆశించినస్థాయిలో ఆడలేదు. ఈక్రమంలో ఈరెండు జట్ల మధ్య పోటీ హోరాహోరీగా సాగే అంచనాలు కనిపిస్తున్నాయి. బెంగళూరు జట్టుకు రజత్ పాటిదార్ నాయకత్వం వహిస్తున్నాడు. హైదరాబాద్ జట్టుకు ఇషాన్ కిషన్ సారథ్యం వహిస్తున్నాడు. కిషన్ కు తొలిసారి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడంతో అతడుజట్టును ఎలా నడిపిస్తాడనేది ఆసక్తికరం.

బెంగళూరు, హైదరాబాద్ లో భీకరమైన ప్లేయర్లు ఉన్నారు. ఫ్లాట్ మైదానంకావడంతో పరుగుల వరదపారడం ఖాయం. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకోవచ్చు. డ్యూ ఉన్నప్పటికీ బౌలర్లు సత్తా చూపిస్తే మొదట బ్యాటింగ్ చేసిన జట్టుకు అడ్వాంటేజ్ లభిస్తుంది. బెంగళూరు, హైదరాబాద్ ఇప్పటి వరకూ 25 మ్యాచ్ లు ఆడాయి. ఇందులో హైదరాబాద్ 13, బెంగళూరు 11 మ్యాచ్ లలో విజయం సాధించాయి.2024 సీజన్ లో బెంగళూరు మీద హైదరాబాద్ జట్టు287 పరుగులు చేసింది. ఐపీఎల్ చరిత్ర లో ఓ జట్టు సాధించిన అత్యధికస్కోరుగా ఇది కొనసాగుతోంది. హైదరాబాద్ సాధించిన ఈ రికార్డును మరే జట్టూ ఇంత వరకూ సాధించలేకపోవడం గమనార్హం. రెండు జట్లలో భీకరమైన ప్లేయర్లు ఉన్నారు.

బెంగళూరులో విరాట్, రజత్ పాటిదార్, బెతల్, దయాళ్, సాల్ట్, జితేష్ శర్మ, కాక్స్ వంటివారితో బ్యాటింగ్ దళం బలంగా కనిపిస్తోంది. టిమ్ డేవిడ్, క్రునాల్ పాండ్యా, షెపర్డ్, వెంకటేష్ అయ్యర్, మంగేష్ వంటి వారు ఆల్ రౌండర్ పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నారు. హేజిల్ వుడ్ ఎంట్రీ పై క్లారిటీ లేకపోవడంతో బౌలింగ్ వీక్ గా కనిపిస్తోంది. హేజిల్ వుడ్, రసిఖ్ ధార్, సుయాష్ శర్మ, భువనేశ్వర్ శర్మ, తుషార, అభినందన్ సింగ్, డఫీ, యష్ దయాళ్ వంటి బౌలింగ్ విభాగంలో కీలకంగా ఉన్నప్పటికీ వీరిలో ఎవరికి అవకాశం లభిస్తుందో చూడాలి.

హైదరాబాద్ లో ఇషాన్ కిషన్, అనికేత్ వర్మ, హెడ్, అభిషేక్ శర్మ, సలీల్అరోరా, క్లాసెన్ కీలక బ్యాటర్లుగా ఉన్నారు.హర్షల్ పటేల్, కామిందు మెండిస్, హర్ష్ దుబే, బ్రెడన్ కార్స్, శివాంగ్ కుమార్, క్రెయిన్స్ పులేత్రా, లియామ్ లివింగ్ స్టోన్, డేవిడ్ పేన్, అభిషేక్ శర్మ, నితీష్ కుమార్ రెడ్డి వంటి వారు ఆల్ రౌండర్లుగా ఉన్నారు. కమిన్స్ జట్టులోకి వచ్చినప్పటికీ ఆడేది అనుమానమే. జీషబ్ అన్సారీ, జయదేవ్ ఉనద్కత్, ఇసాన్ మలింగ, హుస్సేన్, ఓంకార్ తుర్మలే, అమిత్ కుమార్, ప్రఫుల్ హింజ్, శివంమావి కీలక బౌలర్లుగా ఉన్నారు. వీరిలో శివం మావి, మలింగ, జయదేవ్ కు తుది జట్టులో చోటు లభించే అవకాశం ఉంది.

# పరువు పోగొట్టుకున్న పాకిస్తాన్.. మ్యాచ్‌లో బంతి రంగు మార్పు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

పాకిస్తాన్ సూపర్ లీగ్ (PSL) ప్రారంభ మ్యాచ్‌లో విచిత్ర ఘటన చోటుచేసుకుంది. గడాఫీ స్టేడియంలో లాహోర్ ఖలందర్స్, హైదరాబాద్ కింగ్స్‌మెన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బంతి ముందుగా పింక్, తరువాత ఎరుపు రంగులోకి మారింది. హైదరాబాద్ జట్టు ఆటగాళ్ల జెర్సీ రంగు బంతికి అంటుకోవడం వల్లే ఇలా జరిగి ఉంటుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. జెర్సీలు నాసిరకంగా ఉండటం కారణమై ఉండొచ్చని అనుమానం వ్యక్తమైంది. ఆట మధ్యలో బంతి రంగు మారడంతో ఆటగాళ్లు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ విషయంపై హైదరాబాద్ కెప్టెన్ మార్నస్ లబుషేన్ అంపైర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపాడు. రెండో ఓవర్ తర్వాతే బంతి ఎరుపు రంగులోకి మారిందని, గతంలో ఇలాంటి ఘటన ఎప్పుడూ చూడలేదని మ్యాచ్ అనంతరం పేర్కొన్నాడు. బ్యాట్ లేదా ప్యాడ్ వల్ల రంగు మారడం చూసినా, దుస్తుల వల్ల ఇలా జరగడం ఇదే మొదటిసారి అని వెల్లడించాడు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో కూడా విమర్శలు వెల్లువెత్తాయి. రాబోయే మ్యాచ్‌లలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అభిమానులు కోరుతున్నారు. ఈ మ్యాచ్‌లో లాహోర్ ఖలందర్స్ జట్టు విజయం సాధించగా, హైదరాబాద్ కింగ్స్‌మెన్స్ జట్టు సోషల్ మీడియాలో ప్రత్యర్థి జట్టుకు అభినందనలు తెలిపింది.



# ధోని ఇంపాక్ట్ ప్లేయర్‌గా వద్దు: అశ్విన్

ఐపీఎల్ ప్రారంభానికి ముందు రవిచంద్రన్ అశ్విన్, ఎంఎస్ ధోనిపై కీలక వ్యాఖ్యలు చేశాడు. చెన్నై జట్టులో ధోని ఇంపాక్ట్ ప్లేయర్‌గా కాకుండా ప్లేయింగ్ ఎలెవన్‌లో తప్పనిసరిగా ఉండాలని అభిప్రాయపడ్డాడు. ఒకవేళ ఆడకూడదనుకుంటే సీజన్ మొత్తాన్ని ఆడొద్దని, కానీ ఇంపాక్ట్ ప్లేయర్‌గా మాత్రం బరిలోకి దిగొద్దని తన యూట్యూబ్ ఛానల్‌లో పేర్కొన్నాడు.

చెన్నై ప్లేయింగ్ ఎలెవన్‌ను రూపొందిస్తే అందులో ధోనికి స్థానం తప్పనిసరిగా ఉండాలని అశ్విన్ తెలిపాడు. తాను ఆడగలననే నమ్మకం ధోనిలో 100 శాతం ఉందని, గత మూడు నెలలుగా క్రమం తప్పకుండా ప్రాక్టీస్ చేస్తున్నాడని చెప్పాడు. ధోని మైదానంలో ఉంటే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు దిక్సూచిలా పని చేస్తాడని, కొత్త బౌలింగ్ లైనప్‌కు మార్గనిర్దేశనం అందిస్తాడని వివరించాడు.

ఈ సీజన్‌లో ధోని ఎక్కువగా చివర్లోనే బ్యాటింగ్‌కు వచ్చే అవకాశముందని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. వికెట్ కీపింగ్‌పై ప్రధానంగా దృష్టి సారిస్తూ, ఫీల్డ్ సెట్టింగ్ విషయంలో కెప్టెన్‌కు సూచనలు ఇస్తాడని చెప్పాడు. మొత్తం మీద జట్టులో ధోని పెద్దన్న పాత్ర పోషిస్తాడని అశ్విన్ వెల్లడించాడు.



# కెప్టెన్సీ మార్పు చేస్తే పొరపాటు: కైఫ్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ ప్రారంభానికి ముందు టీమిండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్, ముంబయి జట్టుకు కీలక సూచనలు చేశాడు. ప్రస్తుతం హార్దిక్ పాండ్య కెప్టెన్‌గా కొనసాగుతున్న నేపథ్యంలో సూర్యకుమార్ యాదవ్‌కు కెప్టెన్సీ అప్పగించాలన్న సూచనలను ఆయన తప్పుపట్టాడు. కెప్టెన్సీ మార్పు విషయంలో ముంబయి మరోసారి పొరపాటు చేయకూడదని, రోహిత్ శర్మ నుంచి బాధ్యతలు మార్చిన తర్వాత జట్టు ప్రదర్శన పడిపోయిందని పేర్కొన్నాడు.

ఇప్పుడిప్పుడే హార్దిక్ పాండ్య కుదురుకుంటున్నాడని, ఈ సమయంలో మళ్లీ కెప్టెన్సీ మారిస్తే జట్టుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని కైఫ్ అభిప్రాయపడ్డాడు. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీకి మంచి ఆప్షన్ అయినప్పటికీ, రోహిత్ శర్మ విషయంలో జరిగిన పరిస్థితి మళ్లీ పాండ్యకు జరగకూడదని స్పష్టం చేశాడు.

ఇక ఆర్సీబీ జట్టుకు జోష్ హేజిల్‌వుడ్ చేరినప్పటికీ వెంటనే మ్యాచ్‌లకు అందుబాటులో ఉండకపోవచ్చని తెలుస్తోంది. గాయాల నుంచి కోలుకుంటున్న అతడు కొన్ని మ్యాచ్‌ల తర్వాత బరిలోకి దిగే అవకాశముంది. మరోవైపు నువాన్ తుషారకు ఎన్‌ఓసీ రాకపోవడంతో అతడు లేకుండానే ఆర్సీబీ బరిలోకి దిగనుంది. శ్రీలంక బోర్డ్ తీసుకున్న కఠిన నిర్ణయాలపై మాజీ క్రికెటర్ చమింద వాస్ అసంతృప్తి వ్యక్తం చేశాడు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
28.03.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**పెట్రోల్, డీజిల్ ఆదా కోసం మెల్లగా యాక్సిలరేట్ చేయండి**

ఒక్కసారిగా స్పీడ్ పెంచడం వల్ల ఇంధనం ఎక్కువగా ఖర్చవుతుంది. స్లోగా యాక్సిల-రేట్ చేస్తే మైలేజ్ మెరుగవుతుంది.





## రాంచరణ్ పుట్టినరోజున
# చిరంజీవి మెగా సాయం

**ముద్ర సినిమా డెస్క్ :**
మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన సేవా భావాన్ని చాటుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రదానం చేసిన ఎన్‌టీఆర్ అవార్డు కింద వచ్చిన రూ.10 లక్షల నగదు బహుమతిని ఆయన పూర్తిగా దాతృత్వ కార్యక్రమాలకు విరాళంగా ఇచ్చారు. తన కుమారుడు రాంచరణ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ నిర్ణయం తీసుకున్న చిరంజీవి, ఐదు సేవా సంస్థలకు సహాయం చేశారు. వృద్ధాశ్రమాలకు, దివ్యాంగులకు, అనాథ పిల్లలకు సేవలందిస్తున్న సంస్థలకు ఆర్థికంగా తోడ్పాటు అందించారు. అలాగే క్యాన్సర్‌తో పోరాడుతున్న ఓ చిన్నారి చికిత్స కోసం కూడా విరాళం ఇచ్చి తన మానవతా దృక్పథాన్ని మరోసారి నిరూపించారు. వ్యక్తిగత వేడుకను సామాజిక సేవగా మార్చిన చిరంజీవి చర్యకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## వెంకీ–కళ్యాణ్ రామ్ తో అనిల్ రావిపూడి చిత్రం షురూ



టాలీవుడ్‌లో భారీ మల్టీ స్టారర్ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. షైన్ స్క్రీన్స్ అధినేత సాహు గారపాటి నిర్మాణంలో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కలిసి నటించనున్న కొత్త చిత్రం సంక్రాంతి 2027కు విడుదల కానుంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రం ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.ఇప్పటికే వెంకటేష్‌తో ఎఫ్2, ఎఫ్3 వంటి హిట్ సినిమాలు అందించిన అనిల్ రావిపూడి, ఈసారి మరోసారి వినోదభరితమైన కథతో రాబోతున్నారు. అలాగే కళ్యాణ్ రామ్‌తో 'పటాస్' తర్వాత ఇది రెండో సినిమా కావడం విశేషం.సురేష్ ప్రొడక్షన్స్ సమర్పణలో, జీ స్టూడియోస్ సహ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. త్వరలో పూజా కార్యక్రమాలతో చిత్రాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు.భారీ తారాగణం, హిట్ కాంబినేషన్‌తో ఈ చిత్రం సంక్రాంతి 2027లో బాక్సాఫీస్ వద్ద పెద్ద ఎంటర్‌టైనర్‌గా నిలవనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## అనకాపల్లి టీజర్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం




తెలుగు సినీ అభిమానుల్లో ఆసక్తి రేపుతున్న "అనకాపల్లి" సినిమా నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చింది. యాక్షన్, రా ఇంటెన్సిటీతో నిండిన ఈ చిత్ర టీజర్‌ను మార్చి 29 ఉదయం 9:18 గంటలకు విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.
"ఫియర్‌స్ అండ్ బ్రూటల్ వరల్డ్"లోకి తీసుకెళ్లే ఈ సినిమా భారీ యాక్షన్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను అలరించనుందని టీమ్ చెబుతోంది.
"స్టార్మ్ ఈజ్ కమింగ్... అండ్ ఇట్ వోంట్ హోల్డ్ బ్యాక్" అంటూ విడుదల చేసిన పోస్టర్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.
ఈ చిత్రంలో విక్రమ్ సహిదేవ్, సంధ్య వశిష్ట, తరక్ పొన్నప్ప, ఇంద్రజ, సంగీత వంటి నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. త్రినాధరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను భవ్యశ్రీ ఫిలిమ్స్ నిర్మిస్తోంది. టీజర్ రిలీజ్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## యానిమల్ ప్రింట్ డ్రెస్‌తో సమంత స్పెషల్ అట్రాక్షన్



ప్రముఖ నటి సమంత రూత్ ప్రభు ఇటీవల నిర్వహించిన స్టైలిష్ ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆమె స్టైలిష్ లుక్‌తో అందరి దృష్టిని ఆకట్టుకుంది.
ఈ వేడుకకు సమంత యానిమల్ ప్రింట్ డ్రెస్‌లో హాజరైంది. బాడీకి సరిపోయేలా రూపొందించిన ఈ డ్రెస్ ఆమెకు బోల్డ్ లుక్‌ను తీసుకొచ్చింది. హై నెక్ డిజైన్‌తో పాటు స్ట్రక్చర్డ్ షోల్డర్స్ ఉండటంతో ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణ కలిగింది. మొత్తం స్టైలింగ్ ఆమె ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించేలా కనిపించింది.

# జీ5లో 'హే బల్వంత్' స్ట్రీమింగ్..

**ముద్ర, సినిమా డెస్క్:**
వైవిధ్యమైన కంటెంట్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5లో మరో కామెడీ డ్రామా 'హే బల్వంత్' స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. గోపి ఆచార్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సుహాస్, శివానీ నాగరం హీరో హీరోయిన్లుగా నటించగా, వి.కె. నరేష్ కీలక పాత్ర పోషించారు. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై బి. నరేంద్ర రెడ్డి నిర్మించిన ఈ చిత్రం మార్చి 31 నుంచి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది.
గుంటూరు నేపథ్యంతో రూపొందిన ఈ కథలో కృష్ణ అనే యువకుడు తన తండ్రి వ్యాపారాన్ని కొనసాగించాలని భావిస్తాడు. అయితే తండ్రి చేసే వ్యాపారం గురించి తెలిసిన తర్వాత అతను షాక్‌కు గురవుతాడు. ఇదే సమయంలో మిత్ర అనే యువతితో ప్రేమలో ఉండటం, ఆమె ఎన్‌జీఓ నిర్వహించడం వల్ల కృష్ణ జీవితంలో నైతిక సందిగ్ధతలు ఎదురవుతాయి. తండ్రీ కొడుకు మధ్య అనుబంధం, ప్రేమ, కుటుంబ విలువల మధ్య అతను తీసుకునే నిర్ణయాలే సినిమా ప్రధాన కథాంశంగా ఉంటాయి.
ఈ సందర్భంగా సుహాస్ మాట్లాడుతూ కుటుంబ విలువలు, నైతిక సందిగ్ధతలతో పాటు మంచి కామెడీ, భావోద్వేగం కలిసిన సినిమా ఇదని తెలిపారు. వి.కె. నరేష్ మాట్లాడుతూ తండ్రీ కొడుకు అనుబంధాన్ని ఈ చిత్రంలో హృద్యంగా చూపించామని, నటుడిగా తనలోని భిన్న కోణాన్ని ఆవిష్కరించిన సినిమా ఇదని పేర్కొన్నారు. మార్చి 31 నుంచి జీ5లో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చని తెలిపారు.



# మింట్ గ్రీన్ చీరలో మెరిసిన అలియా భట్

బాలీవుడ్ నటి అలియా భట్ ఇటీవల సినిమాల విడుదలలు లేకపోయినా తన స్టైల్‌తో ఎప్పటికప్పుడు ట్రెండ్‌లో నిలుస్తోంది. గతంలో విడుదలైన 'జిగ్రా' ఆశించిన ఫలితం ఇవ్వకపోవడంతో పాటు ఆమె నటిస్తున్న కొత్త చిత్రాల విడుదలల్లో ఆలస్యం జరుగుతోంది. అయినప్పటికీ ఫ్యాషన్ లుక్స్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది.
ఇటీవల అలియా భట్ మింట్ గ్రీన్ రంగు చీరలో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. సున్నితమైన ఎంబ్రాయిడరీతో రూపొందించిన ఈ చీర ఆమెకు ఎలిగెంట్ లుక్‌ను తీసుకొచ్చింది. ముఖ్యంగా ఆమె ధరించిన చోకర్ నెక్లెస్ మొత్తం లుక్‌కు రాయల్ టచ్ ఇచ్చింది.
స్టైలింగ్ విషయంలో సింపుల్ మేకప్, సహజమైన గ్లోతో పాటు చీరకు సరిపోయే హెయిర్ స్టైల్‌ను ఎంచుకుంది. సినిమాల విడుదలలు లేకపోయినా తన స్టైల్, ప్రెజెన్స్‌తోనే అభిమానుల్లో చర్చనీయాంశంగా మారుతోంది.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad500013.Published at H. No. 63569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com